# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 59 | విశాఖపట్నం | 29-11-2025 శనివారం | చీఫ్ ఎడిటర్ : ఎస్.ఎస్. రాజు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 59 | VISAKHAPATNAM | 29-11-2025 SATURDAY | CHIEF EDITOR: S.S. RAJU | Pages:8 | Rate: Rs.5/-



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.

అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.

ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9849349934


## అమరావతిలో 25 బ్యాంకుల కార్యాలయాల నిర్మాణాలకు

# నిర్మలా సీతారామన్ శంకుస్థాపన



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిలో 25 బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, నారాయణ, పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఆయా బ్యాంకుల చైర్మన్లు, సీఎండీలు ఉన్నతాధికారులు హాజరయ్యారు.

రాజధాని సీడ్ యాక్సెస్ రహదారి పక్కన సీఆర్డీఏ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద మొదటి బ్లాక్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాజధాని రైతులు, వ్యవసాయ కూలీలు, మహిళలు, స్థానికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ రాజధానిలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ కోపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడీబీఐ, ఎల్ఐసీ, న్యూ ఇండియా అసురెన్స్ లిమిటెడ్ కార్యాలయాలకు శంకుస్థాపన చేసారు.

## అమరావతిని ఆర్థిక కేంద్రంగా

# తీర్చిదిద్దడమే లక్ష్యం: చంద్రబాబు




**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతిని నెక్స్ట్ లెవల్‌కి తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. భారతదేశం గర్వపడేలా రాజధాని రూపుదిద్దుకుంటుందని స్పష్టం చేశారు. అమరావతిలో 15 బ్యాంకులకు, ప్రభుత్వరంగ సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో చంద్రబాబు మాట్లాడారు. ఏ అత్యాధునిక సాంకేతికత వచ్చినా దానిని అంది పుచ్చుకునే హబ్‌గా అమరావతి తయారవుతుందని వెల్లడించారు. దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టే ప్రక్రియలో ఆంధ్రప్రదేశ్ కీలక పాత్ర పోషిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. 7 జాతీయ రహదారులు అమరావతికి అనుసంధానం అవుతాయని సీఎం వెల్లడించారు. 2028కి అమరావతిలో నిర్మాణాలన్నీ పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించామని వెల్లడించారు. పదవీ విరమణ తర్వాత ఎవరైనా స్థిరపడాలనుకుంటే వారికి సరైన (తరువాయి 2వ పేజీలో)

## అజెండాలోని 26 అంశాలకు

# ఏపీ కేబినెట్ ఆమోదం



**అమరావతి, పతాకం న్యూస్:** అమరావతి పరిధిలో రెండో దశ భూసమీకరణకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది. దాదాపు 25కు పైగా అజెండా అంశాలతో సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ప్రారంభమైంది. 7 గ్రామాల పరిధిలో మరో 16,666.57 ఎకరాల భూసమీకరణకు సీఆర్డీఏకు అనుమతించే ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, వడ్లమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి గ్రామాల పరిధిలో సీఆర్డీఏ భూసమీకరణ చేపట్టనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన దాదాపు 3 గంటల పాటు మంత్రి వర్గ సమావేశం జరిగింది. అజెండాలోని 26 అంశాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఖరీఫ్ అవసరాల కోసం మార్క్‌ఫెడ్ ద్వారా 5 వేల కోట్ల రుణం తీసుకునేందుకు ప్రభుత్వం గ్యారెంటీ కల్పించే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ఎస్వీ యూనివర్సిటీలో 33 ఎకరాల భూమి లైవ్‌స్టాక్ రీసెర్చ్ కేంద్రం ఏర్పాటు ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం లభించనుంది.



**అమరావతి భవిష్యత్తుకు ఇవి గట్టి పునాదులు: పవన్**

2లో



**సెల్‌ఫోన్లలో బాల్యం బందీ**

2లో

## 77 అడుగుల రాముడి విగ్రహాన్ని

# ఆవిష్కరించిన మోడీ



**గోవా:** దక్షిణ గోవా కనకోన పట్టణంలోని శ్రీ సంస్థాన్ గోకర్ణ పార్టగాలి జీవోత్తం మఠం లో ఏర్పాటు చేసిన 77 అడుగుల ఎత్తైన శ్రీరాముని కంచు విగ్రహాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ శుక్రవారంనాడు ఆవిష్కరించారు. మఠం 550వ వార్షికోత్సవం సందర్భంగా ఈ విగ్రహావిష్కరణ జరిగింది. సాధువులు, సంతులతో తనకున్న ఆధాత్మిత అనుబంధాన్ని ప్రధాని మోదీ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ప్రజలు తమ సంస్కృతితో మమేకమయ్యేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ప్రధాని మోడీ అన్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకులు

# బాధ్యత తీసుకోవాలి: సీతారామన్

**అమరావతి, పతాకం న్యూస్:** దేశానికి పౌష్టికాహారం అందించే రైతులకు అంతకు మించి ఆర్థిక ప్రయోజనాలు కల్పించాలనే బాధ్యత బ్యాంకులపై ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అమరావతిలో బ్యాంకులు, బీమా సంస్థల కార్యాలయాల నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ అమరావతిలో ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేసి సరిపెట్టకుండా రాజధాని నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులకు ఇబ్బందులు లేకుండా బ్యాంకులు బాధ్యత తీసుకోవాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఏడాదిన్నరలో ఏపీ ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరం అవుతుందని ఆకాంక్షించారు. విభజిత ఆంధ్రప్రదేశ్‌కు ఎంత వేగంగా సాయం చేయాలో చేయండి అని తనకు ప్రధాని నరేంద్ర మోడీ నిర్దేశించినట్లు సీతారాం వెల్లడించారు. ఆహార భద్రత కోసం ఆలోచిస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు మౌలిక సదుపాయాలు కల్పించి సహకరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆమె అభిప్రాయపడ్డారు. భవిష్యత్తు రాజధాని అమరావతి నిర్మాణం తన భుజాలపై మోస్తున్న సీఎం చంద్రబాబుని చూసి అంతా గర్వపడాలని నిర్మలా సీతారామన్ తెలిపారు. అనుకున్నట్లే అమరావతి అభివృద్ధి చెందాలని (తరువాయి 2వ పేజీలో)




పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్ APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## అన్నదాతను ఆదుకోవాలి

'రైతు దు:ఖిస్తే రాజ్యం వర్థిల్లదు' అని పెద్దలు అంటారు. కానీ, మనదేశంలో రైతు కన్నీరు పెట్టుకోని రోజే లేకుండాపోయింది. బలవంతపు భూసేకరణలు, ప్రకృతి వైపరీత్యాలు, పంటలకు మద్దతు ధర దక్కని పరిస్థితులు %% అన్నదాతను నిత్యం అవస్థల పాలు చేస్తూనే ఉన్నాయి. ఈ ఏడాది మన రాష్ట్రంలో ఖరీఫ్‌లో యూరియా కొరత దగ్గర నుంచి ప్రతి పంట కాలంలోనూ సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. మామిడి, బర్లీ పొగాకు, మిరప, పత్తి, ఉల్లి, చెరుకు, మొక్కజొన్న, టమాటా, ధాన్యం, తాజాగా అరటి రైతులు పెట్టుబడి కూడా తిరిగి చేతికి రాకపోవటంతో తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ప్రతి ఏటా ఇలాంటి పరిస్థితి ఉత్పన్నమవుతున్నా- రైతాంగాన్ని ఆదుకోవటానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన కార్యాచరణ ప్రణాళిక చేపట్టకపోవటం విచారకరం. సమస్య ముందుకొచ్చినప్పుడు సానుభూతి చూపించటం, ఏవో కొన్ని ఉపశమన చర్యలు తీసుకోవటంతోనే పాలకులు చేతులు దులుపుకోవటం శోచనీయం. సంపన్నులైనా సామాన్యులైనా బతకటానికి అన్నం తినాల్సిందే! అలాంటి ఆహారాన్ని ఆరుగాలం శ్రమించి దేశానికి అందించేది రైతులు, వ్యవసాయ కార్మికులు. ఇంత కీలకమైన ఆహారోత్పత్తిని సాధిస్తున్న వ్యవసాయరంగం పట్ల పాలకులు ప్రత్యేకమైన శ్రద్ధ చూపించాలి. ఆసరా అందించాలి. దురదృష్టవశాత్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండింటిలోనూ అలాంటి స్ప ృహ లోపించింది. ఎరువులు, విత్తనాలపై ఇచ్చే రాయితీలకు ఏటేటా దిగ్గోత కొనసాగుతోంది. పోనీ, అధిక ధరలకిచ్చే ఎరువులు, విత్తనాలనైనా సకాలంలో సమకూర్చుతున్నారా అంటే అదీ లేదు. ఈ ఏడాది ఖరీఫ్‌లో యూరియా కొరతతో విలవిల్లాడిన రైతులు పోలీసు లాఠీలను కూడా రుచి చూడాల్సి వచ్చింది. తోతాపురి మామిడి ధర దారుణంగా పడిపోయింది. ఆ తరువాత ఉల్లి పంటకూ అదే పరిస్థితి! మార్కెట్టుకు తెచ్చిన పంట అమ్ముడుపోక, నిరాశ చెందిన రైతులు దానిని రోడ్లపైనే పారబోసి, నిరసన వ్యక్తం చేసిన దృశ్యాలు ప్రతి ఒక్కరినీ కలచివేశాయి. వీటికి ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర పూర్తిస్థాయిలో అమలు కాకుండానే పోయింది. ఆశలు కల్పించి సాగులోకి దించిన పొగాకు కంపెనీలు ఆ తరువాత పంటను కొనకుండా చేతులెత్తేసినా, రాష్ట్ర ప్రభుత్వం కిమ్మనలేదు. కోసిన కూలి కూడా రానంత స్థాయికి ధర దిగజారిపోయి టమాటా రైతులు కూడా కన్నీరు పెట్టుకున్నారు. లక్షల రూపాయల పెట్టుబడిని నష్టపోయామని నెత్తీనోరూ కొట్టుకున్నా పాలకుల చెవికెక్కింది లేదు. ఇప్పుడు రిటైల్ మార్కెట్లో అరటి ధర బాగానే ఉన్నా %-% రైతుల దగ్గర మాత్రం కొనుగోలు ధర కుప్పకూలిపోయింది! పంటలకు ప్రభుత్వం నుంచి కనీస ధర మద్దతు, మార్కెట్లో పర్యవేక్షణ, జోక్యమూ ఉంటే ఇలాంటి దుస్థితి దాపురించదు. దళారుల దయాదాక్షిణ్యాల మీద, మార్కెట్ శక్తుల మాయోపాయాల మీద వదిలిస్తే- దిగుబడులు ముమ్మరంగా ఉన్న వేళ ధరల తగ్గింపు నాటకాలు యథేచ్ఛగా సాగుతూ ఉంటాయి. ఒక వేళ నిజంగానే మార్కెట్టు ఒడిదుడుకులకు గురైనా రైతు పడిపోకుండా ప్రభుత్వం ఆదుకోవాలి. తగినంత స్థాయిలో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. ఇరవై ఏళ్ల క్రితమే స్వామినాథన్ కమిషన్ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. సి2 ప్లస్ 50 ఫార్ములా ఉన్నంతలో రైతులను కష్టాల ఊబిలోనుంచి బయటకు తేగలిగిన ఆచరణీయ సిఫార్సు. దానిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ అమలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రకృతి వైపరీత్యాలకు, పాలకుల అలిష్టాలకు ఎదురొడ్డి సాగుతున్న మన వ్యవసాయ రంగంలోకి చొచ్చుకురావాలని అమెరికా కార్పొరేటు కంపెనీలు ఎన్నేళ్ల నుంచో కాచుక్కూచున్నాయి. అన్నదాతల గురించి ఒకపక్క మొసలి కన్నీరు కారుస్తూనే- మరోపక్క కార్పొరేట్లకు తాకట్టు పెట్టే కుటిల యత్నాలను బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తూ ఉంది. పత్తి దిగుమతి అంశంలో మోడీ సర్కారు లొంగుబాటు మన రైతుల కష్టాలను పెంచబోతోంది. ట్రంపు ఒత్తిళ్లకు తలొగ్గి, వ్యవసాయ రంగంలో చేసుకుంటున్న ఒప్పందాలు భారత రైతాంగానికి వెన్ను విరుపే అవుతుంది. భారత రైతాంగమూ, వారి శ్రేయస్సును కోరుకునే ప్రజలూ ఐక్యంగా రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి. పంటలను, రైతులను మార్కెట్ల గాలికి వదిలేయకుండా తగు రక్షణ, భరోసా కల్పించేలా పాలకులపై ఒత్తిడి తేవాలి.

## అమరావతి పునఃప్రారంభంపై నిర్మలా సీతారామన్ హర్షం




**అమరావతి, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణ పనులు పునఃప్రారంభం కావడం సంతోషకరమని, ఇది ఒక యజ్ఞం లాంటిదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. దేశంలో ఒక కొత్త రాజధాని నగరాన్ని నిర్మించడం సామాన్య విషయం కాదని, ఈ బృహత్కార్యానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పూర్తి సహకారం అందిస్తున్నారని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం అమరావతిలో 15 ప్రభుత్వ రంగ బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె ప్రసంగించారు. భవిష్యత్ రాజధానికి ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతోనే ప్రభుత్వ రంగ ఆర్థిక సంస్థలు (పీఎస్‌యూ) తమ ప్రధాన కార్యాలయాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నాయని నిర్మలా సీతారామన్ తెలిపారు. ఒకేచోట ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో 15 బ్యాంకులు, బీమా సంస్థలు కార్యకలాపాలు ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రాజధాని నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులను ఎన్నటికీ మర్చిపోకూడదని, వారి ప్రయోజనాలను కాపాడటం బ్యాంకుల బాధ్యత అని గుర్తుచేశారు. బ్యాంకులు కేవలం కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రుణాలు ఇవ్వడానికే పరిమితం కాకుండా, రైతుల ఉత్పత్తులకు మార్కెటింగ్, ప్యాకింగ్, కోల్డ్ చెయిన్ వంటి సౌకర్యాలు కల్పించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సూచించారు. ముఖ్యంగా రాయలసీమలోని 9 జిల్లాల నుంచి ఉద్యాన ఉత్పత్తులను ఇతర రాష్ట్రాల మార్కెట్లకు తరలించడానికి బ్యాంకులు సహకరించాలని పిలుపునిచ్చారు. దేశంలో గత పదేళ్లలో 25 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటకు తీసుకువచ్చామని, మధ్యతరగతి ప్రజల ఆకాంక్షలు కూడా పెరుగుతున్నాయని నిర్మల వివరించారు. ఈ మార్పులకు అనుగుణంగా బ్యాంకులు భవిష్యత్ ఆలోచనలతో, సమీకృత ఐడియాలతో పనిచేయాలని సూచించారు. గతంలో 'మహిళా సఖి' పేరుతో మహిళలను బీమా ఏజెంట్లుగా మార్చే కార్యక్రమం అద్భుత ఫలితాలు ఇచ్చిందని గుర్తుచేశారు. విభజన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఆంధ్రప్రదేశ్‌కు అన్ని విధాలా అండగా నిలవాలని ప్రధాని మోదీ ఎప్పుడూ చెబుతుంటారని, ఏపీ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆయన తక్షణమే ఆమోదం తెలుపుతారని అన్నారు. రాష్ట్ర భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని క్వాంటం వ్యాలీ, ఏఐ ప్రాజెక్టుల కోసం జిల్లాల్లో ప్రత్యేక శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కేవలం ఐటీ మాత్రమే కాకుండా, ఆస్ట్రో ఫిజిక్స్ వంటి రంగాల్లోనూ ఏపీని ముందుకు తీసుకెళ్తున్నామని, ఇందులో భాగంగా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రో ఫిజిక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడం సంతోషకరమన్నారు. ఆచార్య నాగార్జునుడు వంటి గొప్ప శాస్త్రవేత్తలు నడయాడిన ఈ గడ్డపై, అమరావతిలో ఒక కాస్మోస్ ప్లానెటోరియం నిర్మిస్తుండడం హర్షణీయమని అన్నారు. రానున్న ఏడాదిన్నర కాలంలో ఆంధ్రప్రదేశ్ ఒక ఫ్యూచరిస్టిక్ కేపిటల్ నగరంగా రూపుదిద్దుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల రేర్ ఎర్త్ మినరల్స్‌పై కీలక నిర్ణయం తీసుకుందని, ఈ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవడానికి కూడా ఏపీ కృషి చేయాలని నిర్మలా సీతారామన్ కోరారు.

## తిరుమల పర్యావరణ పరిరక్షణకు టీటీడీ పెద్దపీట



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల పవిత్రత, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని పాత డీజిల్, పెట్రోల్ వాహనాల స్థానంలో విద్యుత్ వాహనాలు వినియోగంలోకి తీసుకురావడానికి టిటిడి విస్తృత చర్యలు చేపట్టినట్లు టిటిడి అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుపతిలోని పద్మావతి విశ్రాంతి భవనంలో శుక్రవారం కేంద్ర రహదారుల మంత్రిత్వ శాఖ (ఢిల్లీ) సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధులు, ఆర్టీసీ, టిటిడి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు తిరుమలను సంపూర్ణ కాలుష్య రహిత పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. మొదటిగా తిరుపతి%-%తిరుమల మధ్య పూర్తి స్థాయిలో విద్యుత్ బస్సులు ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, తిరుమలలో నడిచే ట్యాక్సీలు మరియు ఇతర అద్దె వాహనాలను విద్యుత్ వాహనాలతో దశలవారీగా భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఢిల్లీకి చెందిన సీనియర్ కన్సల్టెంట్ ప్రతినిధి శ్రీ కునాల్ జోషి వివిధ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. దీనిపై పూర్తి స్థాయి నివేదికను అందించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. త్వరలో జరగనున్న టిటిడి బోర్డు సమావేశంలో ఈ అంశంపై చర్చించి తగిన నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. సమావేశంలో టిటిడి డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, విజివో సురేంద్ర, ఐటి డిప్యూటీ జనరల్ మేనేజర్ వెంకటేశ్వర్లునాయుడు, రాష్ట్ర రవాణాశాఖ అధికారులు, ఆర్టీసీ అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## గదభపాలెం పంచాయతీలో గ్రామసభ

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం గదబపాలెం గ్రామ పంచాయతీలో గ్రామసభ మహాత్మా గాంధీ నిర్వహించారు.గ్రామసభలో భాగంగా జాతీయ ఉపాధి హామీ పథకం(ఎంజిఎన్ఆర్ఈజీఎస్) గ్రామాభివృద్ధి కొత్త పనులు,లబ్ధిదారుల ఎంపిక, ప్రజలకు పారదర్శక సమాచారం అందించడానికి ఈ గ్రామ సభను చేపట్టినట్లు అధికారులు తెలిపారు.గ్రామ సభకు స్థానిక సర్పంచ్ ఉల్లి నర్సమ్మ, డౌనూరు ఎంపిటిసి బిడిజన అప్పారావు,మాజీ సర్పంచ్ నీలపు సూరిబాబు హాజరై మాట్లాడారు. గ్రామంలో ప్రతి రైతు,ప్రతి కుటుంబం లబ్ధి పొందే విధంగా కొత్త పనులు ప్రతిపాదించుకోవాల్సిన అవసరం ఉందని,మెట్ల పనులు,విఆర్పీ పనులు వంటి అన్ని పనులకు అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి వర్కులు పెట్టించుకోవాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎపిఎం,టీఏ చిలుకు బాబు, పంచాయితీ కార్యదర్శి రాంబాబు, పెసా కార్యదర్శి ఉల్లి రాంమూర్తి,గ్రామస్తులు సమీరెడ్డి దారకొండ,పోట్టిక నూకరాజు రాంబాబు,శివ,తుబే చంద్రరావు పాల్గొన్నారు.

## అమరావతి భవిష్యత్తుకు ఇవి గట్టి పునాదులు: పవన్ కల్యాణ్



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతిలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని, కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి ప్రజలందరికీ కనిపించేలా పనిచేస్తోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. శుక్రవారం అమరావతి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో రూ.1334 కోట్ల వ్యయంతో నిర్మించనున్న బ్యాంకులు, బీమా కంపెనీల ప్రధాన కార్యాలయాలకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. అమరావతిని ఆర్థిక లావాదేవీల కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఈ కార్యక్రమం ఒక శుభసూచికమని పేర్కొన్నారు. పలు బ్యాంకులు, బీమా సంస్థల ప్రధాన కార్యాలయాలు ఒకేచోట కొలువుదీరడం అరుదైన విషయమని, ఆ ఘనతను అమరావతి సాధించిందని అన్నారు. ఈ కేంద్రాలన్నీ ఒకేచోట ఉండటం వల్ల ఆర్థికంగా అందరికీ ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ రోజు వేస్తున్న పునాదులు అమరావతి ఆర్థిక భవిష్యత్తు నిర్మాణానికి అత్యంత కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఉన్న విశ్వాసంతోనే రైతులు రాజధాని కోసం భూములు త్యాగం చేశారని పవన్ అన్నారు. అమరావతి పునర్నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, స్టీల్ ప్లాంట్ వంటి కీలక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలుస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా సహకరిస్తోందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## తీర్చిదిద్దడమే లక్ష్యం: చంద్రబాబు

గమ్యస్థానంగా అమరావతి ఉంటుందని అన్నారు. వచ్చే 5 ఏళ్లు కేంద్రం రాష్ట్రానికి సహకరిస్తే నిలదొక్కుకోవటంతో పాటు దేశ ఆర్థిక ప్రగతికి వెన్నుముకగా నిలుస్తామని సీఎం స్పష్టం చేశారు. సముద్రంలో కలిసే మిగులు జలాలు వాడుకుని దేశానికి ఆర్థిక తోడ్పాటు ఇచ్చే పోలవరం అనుసంధాన ప్రాజెక్టుకు సహకరించాలని నిర్మలాసీతారామన్‌ను సీఎం కోరారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు సహకరించాలని అడిగారు. పూర్వోదయ ప్రాజెక్టు ద్వారా ఉత్తరాంధ్రకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉన్నందున తగిన తోడ్పాటు ఇవ్వాలని సీఎం కోరారు. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ మినహాయింపు మరో 2 ఏళ్లు పొడిగించాలని విజ్ఞప్తి చేసారు. అమరావతి అన్‌స్థాపబుల్‌గా దూసుకెళ్లేందుకు కేంద్రం అన్ని విధాలా సహకరించాలని అన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చారని అన్నారు. 34,000 ఎకరాలు ఇచ్చిన రైతులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. ప్రపంచంలోనే స్ఫూర్తిదాయక ల్యాండ్‌పూలింగ్ జరిగిన ఏకైక ప్రాంతం అమరావతి అని సీఎం చంద్రబాబు కొనియాడారు. ప్రధాని మోదీ రాజధాని పనులను పునఃప్రారంభం చేశారని సీఎం తెలిపారు. 2028 మార్చి నాటికి పూర్తయ్యేలా అమరావతి పనులు వేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. అందుకు ముఖ్య కారణం నిర్మలా సీతారామన్ అని, వీరు రాజధాని నిర్మాణానికి మాకంటే వేగంగా రూ.15,000 కోట్ల నిధులిచ్చారని కొనియాడారు. రూ.1,334 కోట్లతో వివిధ బ్యాంకులు, బీమా సంస్థల భవనాలకు శంకుస్థాపనలు జరిగాయని, ఒకేచోట అన్ని కార్యాలయాలు ఏర్పాటు చేయడం ముఖ్యమైన అంశమని తెలిపారు. దీనివల్ల 6,576 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని అన్నారు. నిర్మలాసీతారామన్ చాలా త్వరగా నిర్ణయాలు తీసుకుంటారని తెలిపారు. జీఎస్టీ సంస్కరణలు గేమ్‌ఛేంజర్‌గా మారాయని సూపర్ జీఎస్టీ సంస్కరణలతో ఆర్థిక వృద్ధి జరిగేందుకు సీతారామన్ ఎంతో కృషి చేశారని సీఎం కొనియాడారు. అమరావతి పనులు ఊపందుకున్న సమయంలో ప్రభుత్వం పడిపోయిందని సీఎం చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ 5 ఏళ్ల పాలనలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బయటకు తీసుకొచ్చిన ఘనత కేంద్రానిదేనని అన్నారు. రాష్ట్ర ఆర్థికస్థితి ఇంకా ఎంతో కోలుకోవాల్సి ఉందని అందుకు అనుగుణంగా వివిధ రంగాల్లో పెట్టుబడులు ఆకర్షిస్తున్నామని వివరించారు. అమరావతిని నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని భారతదేశం గర్వపడేలా అమరావతి రూపుదిద్దుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. సాంకేతికతను అందిపుచ్చుకునే హబ్‌గా అమరావతి తయారవుతుంది.

## బాధ్యత తీసుకోవాలి: సీతారామన్

ఆకాంక్షించారు. స్ట్రో ఫిజిక్స్ వంటి అత్యాధునిక సైన్స్?ను అందిపుచ్చుకునే రాజధానిగా అమరావతి అవతరిస్తోందని ఆమె కొనియాడారు. ఐఐఏతో చేసుకున్న ఒప్పందం భవిష్యత్ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దుతుందన్నారు. కుటుంబంలో 3, 4 తరాలు ఒకప్పుడు బెనారస్ వెళ్లి సైన్స్ చదవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. శంకుస్థాపన కంటే ఎంఓయూలు ఆకట్టుకున్నాయి: ప్యూర్ సైన్స్ విషయంలో ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్?తో ఎంఓయూ తనను చాలా ఇంప్రెస్ చేసిందన్నారు. భారతదేశంలో చాలా ప్లానిటోరియంలు ఉన్నాయని కాని అమరావతిలో వచ్చేది రియల్ టైంలో కనిపిస్తుందని తెలిపారు. ఈ బ్యాంకుల శంకుస్థాపన కంటే ఎక్కవ ఈ ఎంఓయూ ఆకట్టుకుందని వెల్లడించారు. స్కూలు పిల్లలతో టూర్?కు టిబెట్ వెళ్తే అక్కడ ఉన్న బుద్దిస్ట్?లు నాగార్జునుడి రసాయనశాస్త్రం గురించి మాట్లాడుకుంటున్నారని ఇది ఏపీ సైన్స్ పరిజ్ఞానం సత్తా అని అన్నారు. పండ్లు, కూరగాయల హబ్?గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేదుకు బ్యాంకులు సహకరించాలని కేంద్రమంత్రి సూచించారు. ఆహార అనుబంధ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు బ్యాంకర్లు తోడ్పాటు ఇవ్వాలన్నారు. భూ త్యాగాలు చేసిన రైతులకు ఎలాంటి బ్యాంకింగ్ ఇబ్బందులు లేకుండా బ్యాంకర్లు కృషి చేయాలని సూచించారు. బ్యాంకుల ఏర్పాటు ద్వారా ఎన్నో సమస్యలు వేగంగా పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్లుగా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. రాజధాని నిర్మాణం అంటే సామాన్యం కాదు: రాజధాని నిర్మాణ పనులు మళ్లీ ప్రారంభించడం ఒక యజ్ఞం లాంటిదని నిర్మలాసీతారామన్ అన్నారు. ఒక ప్రణాళిక ప్రకారం నూతన రాజధాని నిర్మాణం అంటే సామాన్యం కాదని తెలిపారు. ఒకే చోట ప్రభుత్వరంగ బ్యాంకులు, బీమా కంపెనీలు ఉండటం చాలా అరుదు అని చెప్పారు. భవిష్యత్‌లో రాజధాని నిర్మాణమంటే అమరావతిని స్ఫూర్తిగా తీసుకుంటారని అన్నారు. రైతుల పంట రవాణాకు ప్రత్యేక రైళ్లు వెళ్తున్నాయని మహారాష్ట్ర నుంచి అరటికాయలు, తమిళనాడు నుంచి కొబ్బరి రవాణా అవుతున్నాయని తెలిపారు. కూరగాయలు, పండ్లకు ఏపీని హబ్‌గా చేసి, ఉత్పత్తుల రవాణాకు సీఎం ఆలోచిస్తున్నారని అందుకు బ్యాంకులు సహకరించాలని నిర్మలా సీతారామన్ సూచిచారు.

# ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 135వ వర్ధంతి



**గాజువాక, పతాకం న్యూస్:** మహాత్మ జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ మెయిన్ గేట్ దగ్గర ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూల మాలాలంకరణ చేసి బీసీ కులాల నాయకులు మరియు రాష్ట్ర వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు నివాళలర్పించారు. ఈ సందర్భంగా పప్పు రాజారావు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశా జ్యోతి జ్యోతిరావు పూలే అని, అణగారిన వర్గాల మరియు మహిళల విద్యావ్యాప్తి కోసం పులే దంపతులు విశేషంగా కృషి చేశారన్నారు. 1848లో పూణేలో బాలికల కోసం భారతదేశపు మొట్టమొదటి పాఠశాలను స్థాపించారు పూలే .ఈ చారిత్రాత్మక పాఠశాలకు ఆయన భార్య సావిత్రిబాయి పూలే తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా వ్యవహరించారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయులు అని ఆయన జీవితం మొత్తం సామాజిక సమానత్వం, విద్య మరియు మానవ హక్కుల కోసం అంకితం చేయబడింది అన్నారు. ఆయన ఆశయాలు నేటికీ లక్షలాది మందికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయి అని అందరూ జ్యోతి రావు పూలే, డా. అంబేద్కర్ ఆశయాలు కొనసాగించాలని రాజారావు కోరారు. ఈ కార్యక్రమము లో స్టీల్ ప్లాంట్ ఎస్సీ సెల్ నాయకులు గుంజా చింతయ్య, తుంగ్లాం పద్మశాలి అధ్యక్ష కార్యదర్శులు నావాన సింహాచలం,కొల్లి కుంచారావు తదితరులు పాల్గొన్నారు.

## చట్ట విరుద్ధ సర్క్యులర్‌ను రద్దు చేయాలని
# ఉక్కు కార్మికుల ధర్నా



**గాజువాక, పతాకం న్యూస్:** వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తితో వేతనాలను ముడిపెడుతూ యాజమాన్యం జారీ చేసిన తాజా సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ఉక్కు అఖిలపక్ష కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ యాజమాన్యం ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలు దయాదాక్షిణ్యం కాదని, హక్కుల కోసం కార్మికులు ఎన్నో ఏళ్లుగా పోరాడిన ఉద్యమాల ఫలితమని పేర్కొన్నారు. గత సంవత్సరం నుంచి సంపూర్ణ వేతనాలు చెల్లించకపోవడం, హెచ్‌ఆర్‌ఎను వాయిదా వేయడం, ఉక్కునగరంలోని ఆరువేలమంది కార్మికులపై అదనపు విద్యుత్ ఛార్జీల భారాన్ని మోపడంవంటి చర్యలు కార్మికులపై దాడికి నిదర్శనాలని అన్నారు. చట్ట విరుద్ధంగా జారీ చేసిన తాజా సర్క్యులర్‌ను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు ఎం రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తి తగ్గడానికి కారణం ఉద్యోగులు కాదని, పాత యంత్రాలు, సమయానికి మరమ్మతులు లేకపోవడం, రా మెటీరియల్ కొరత వంటివేనని తెలిపారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు వల్ల ఆ కార్మికుల కుటుంబాలు వీధుల పాలయ్యేలా సిఎండి ఏకపక్ష నిర్ణయాలు చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాసిరకం రా మెటీరియల్ కొనుగోలు వల్లే ఉక్కు ఉత్పత్తులు తిరస్కరణకు గురయ్యాయన్నారు. స్టీల్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి డి ఆదినారాయణ మాట్లాడుతూ నాలుగేళ్లుగా కార్మికుల హక్కులను యాజమాన్యం ధ్వంసం చేస్తోందని విమర్శించారు. ప్లాంట్‌ను ప్రైవేట్‌కు అప్పగించే కేంద్ర ప్రభుత్వ యత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం మద్దతునిస్తోందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు ఎన్ రామారావు, జె అయోధ్యరాం, కార్మిక నేతలు రమణమూర్తి, డివి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు తదితరులు మాట్లాడుతూ యాజమాన్యం వైఫల్యాన్ని ఉద్యోగులపై నెట్టేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తోందని అన్నారు. మెయింటెనెన్స్ లేమి వల్ల ప్లాంట్‌లో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీసే చర్యలను ప్లాంట్ యాజమాన్యం మానుకోవాలని హితవు పలికారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే భావితరాలకు అందించేందుకు కార్మికులు పోరాటానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పి శ్రీనివాసరాజు, కెఎస్‌ఎన్ రావు, బిఎన్ రాజు, గణపతిరెడ్డి, పరంధామయ్య, డేవిడ్, జిఆర్‌కె నాయుడు, నీరుకొండ రామచంద్రరావు, టివికె రాజు, బి అప్పారావు, బి తౌడన్నతోపాటు పలు విభాగాల నాయకులు, కార్మికులు, రిటైర్డ్ ఉద్యోగులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేద మహిళలకు దుప్పట్లు, పండ్లు, పంపిణీ

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** మహిళలు వ్యాపార, ఆర్థిక రంగాలలో ప్రథమ స్థానం లో ఉండాలన్న దే ప్రధాని మోడీ లక్ష్యమని భారతీయ జనతా పార్టీ ఏపీ వైద్య విభాగం కన్వీనర్ రూపాకుల రవికుమార్ అన్నారు. రూపాకుల రవికుమార్, శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, ప్రకృతి చికిత్సలయము మహారాణిపేట సంయుక్త నిర్వహణలో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి నగర ఆహార తోపుడుబండ్ల సంక్షేమ సంఘం, వి సూర్యనారాయణ ఆధ్వర్యంలో మహిళా చిరు వ్యాపారస్తులకు శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు.




ఈ కార్యక్రమంలో పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ ప్రధాని మోడీ వీధి వ్యాపారుల భద్రత, వ్యాపార అభివృద్ధి, కుటుంబ సంక్షేమం కోసం ముద్ర రుణములు, స్వనిధి, గుర్తింపు కార్డులు అందజేశారన్నారు. విశాఖలో కొందరు అధికారులు అత్యుత్సాహంతో వీధి వ్యాపారాలను నడిరోడ్డున పడవేశారని అన్నారు. ప్రధాని మోడీ 12 సంవత్సరాల పాలనలో లక్షలాదిమంది మహిళలు ఆర్థికముగా ఉన్నత స్థితికి చేరుకున్నారని మహిళా ఎంట్రప్రిన్యూర్ గా, ఎం ఎస్ ఎం ఈ స్థాపకులుగా ఎదుగుతున్నారని, భారత్ ను ఆర్థికంగా ప్రపంచ పటంలో నాలుగో స్థానమునకు తెచ్చిన ఘనత మోడీదని అన్నారు. మహిళా సాధికారత కోసం కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని అన్నారు.

## సీతంపేట స్మశాన భూమికి ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన



**సీతంపేట, పతాకం న్యూస్:** దేవరాపల్లి మండలం నాగయ్యపేట గ్రామ పంచాయతీ శివారు స్మశాన వాటికి భూమీకు పరిహార గోడ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎంపీటీసీ వంటాకు పైడితల్లమ్మ, టిడిపి సీనియర్ నాయకుడు కర్రి నాయుడు కలిపి కొబ్బరికాయ కొట్టి పూజ కార్యక్రమం చేసినారు.ఈ కార్యక్రమంలో కర్రి నాయుడు మాట్లాడుతూ ఈ ప్రహరీ గోడ నిర్మాణముకు గ్రామపంచాయతీ, మండల పరిషత్ నిధులు ఎమ్మెల్యే నిధులతో స్థానిక ప్రజలు సహాయ సహకారాలతో పార్టీలకతీతంగా ఈ ప్రహరీ కూడా నిర్మాణం చేపడుతున్నామని విలేకరులతో చెప్పారు. ప్రజలందరూ సహాయంతోటి విజయవంతంగా పూర్తి చేయడం అతి త్వరలో జరుగుతుందని ఎంపీటీసీ వంటాకు పైడితల్లిమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు వంటాకు శ్రీనివాసరావు మిడతాడ అప్పారావు,లెక్కల వెంకన్న కొట్టాడు దేవుళ్ళు, ఆప్పారావు, మండల ఏరుకునాయుడు, పుల్లి పోతురాజు, మద్దిల దేముడు తదితరులు ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు

## టీడీపీ సీనియర్లకు దక్కిన గౌరవం: చల్లా నానాజీ, కృష్ణవేణి



**దేవరాపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం రైవాడ గ్రామం మాజీ సర్పంచ్ చల్లా కృష్ణవేణి,నానాజీ కాణిపాకం వినాయక టెంపుల్ డైరెక్టర్ గా నియమించటం మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి ఆశీస్సులుతో సీనియర్ నాయకుడుగా అవకాశం ఇవ్వటం సంతోషాన్ని ఇచ్చిందని మాకు అండగా ఉన్న తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి లోకేష్, ఆశీర్వాదంతో , ఆంధ్రప్రదేశ్ కాణిపాక వినాయక , ట్రస్ట్ బోర్డు, చైర్మన్ మణి నాయుడుగా మరియు ట్రస్ట్ బోర్డు, చల్లా కృష్ణవేణితో పాటు, 16 డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం , చేసి ప్రజలుకు, భక్తులుకు ఎల్లప్పుడూ అండగా ఉంటాము అని చైర్మన్ మని నాయుడు తో పాటు చల్లాకృష్ణవాణి డైరెక్టర్లు ఈ విధంగా మీడియాతో అన్నారు

## శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం




**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** విశాఖపట్నం బురుజుపేటలో కొలువై ఉన్న శ్రీశ్రీశ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారిని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శుక్రవారం భక్తిభావంతో దర్శించుకున్నారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఈ సందర్భంగా అర్చకులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “కనకమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని” ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ‘సుంకరమెట్ట’లో శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో జలధర వాటర్ స్కీమ్ ప్రారంభం



**అరకులోయ, పతాకం న్యూస్:** మండల కేంద్రంలోని, సుంకరమెట్ట పంచాయతీ కిన్నంగుడ కె. బెడగుడు శారద ట్రస్ట్ ఆధ్వర్యంలో దివిస్ లేబరేటరీ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం సౌజన్యంతో జలధర వాటర్ స్కీమ్‌ను ప్రారంభించారు. ప్రారంభానికి ముఖ్య అతిథిగా దివిస్ లేబరేటరీ జనరల్ మేనేజర్ వై. కోటేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. గిరిజన ప్రాంతంలో గిరిజనులు ఆరోగ్యంగా ఉండాలని, వారి ఆరోగ్యమే తమకు మహాభాగ్యమని అన్నారు. ఈ గ్రామంలో సుమారు 50 కుటుంబాలు నివసిస్తున్నాయి. నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న గిరిజనులకు సురక్షిత మంచినీరు అందించే సంకల్పంతో ఈ స్కీమ్‌ను అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శారద ట్రస్ట్ మెంబర్స్ కె. చిన్నం నాయుడు, సుంకరమెట్ట సర్పంచ్ దామోదర్, గెమ్మెలి చిన్నబాబు, సిహెచ్ గురుమూర్తి, పి. నాని బాబు, గ్రామ వార్డు మెంబర్ బాబురావు పాల్గొన్నారు.

## ప్రకృతి పంటల రైతుల నడకను జయప్రదం చేయండి



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ప్రకృతి వ్యవసాయ రైతుల పట్ల గౌరవం, ప్రకృతి పట్ల మన ప్రేమను చూపించే ప్రకృతి పంటల రైతుల నడకను జయప్రదం చేయాలని భారతీయ కిసాన్ సంఘం జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం గురుద్వారా వద్ద సంఘం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 29 వ తేదీ శనివారం ఉదయం ఆరు గంటలకు ఆర్కే బీచ్ కాళీమాత ఆలయం వద్దకు తరలిరావాలన్నారు . మనందరం కలసి నడుస్తూ మేళాకు మంచి శుభారంభం చేద్దాం అన్నారు. ఈ నడకలో పాల్గొనె విద్యార్థులకు సర్టిఫికేట్ లు ఇస్తామన్నారు. డిసెంబర్ నెలలో నిర్వహించే ఆర్గానిక్ మేళాను జయప్రదం చేయాలని ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, ప్రకృతి రైతులు పాల్గొన్నారు

## రైతన్న సేవలో కార్యక్రమం ప్రభుత్వం ముందడుగు



**చింతపల్లి, పతాకం న్యూస్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందనీ,వ్యవసాయ రంగం అభివృద్ధికి పంటల కొనుగోలు, కనీస మద్దతు ధర, సేద్యానికి అవసరమైన నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, నీటి సదుపాయాలు, పంట బీమా వంటి కీలక చర్యలు చేపట్టినట్లు మండల అధ్యక్షులు కిల్లో పూర్ణ చంద్రరావు తెలిపారు. 2024-25 సంవత్సరానికి రైతులకు వివిధ విభాగాల ద్వారా ఆర్థిక సహాయం, సబ్సిడీలు, రైతు భరోసా, పంట ఇన్సూరెన్స్‌తో పాటు, నీటి పారుదల సౌకర్యాల విస్తరణపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు పేర్కొన్నారు. గ్రామాల్లో వ్యవసాయ యంత్రాల కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతుల ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించే దిశగా అడుగులు వేస్తున్నట్లు వివరించారు.రైతు శ్రేయస్సే తమ ప్రభుత్వ ధ్యేయమని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కొత్తపాలెం గ్రామం ఆర్ఎంకె సర్వేకు హాజరైన సిబ్బంది,ఎహెచ్ఎ,కుటమి నాయకులు,ఎఎంసి చైర్మన్ చింతపల్లి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళలు వెదురు ఉత్పత్తులతో ఆర్థికంగా అభివృద్ధి



**అడ్డతీగెల, పతాకం న్యూస్:** రంపచోడవరం ఐటిడిఎ పరిధిలో అడ్డతీగల వైటీసీ నందు ఏజెన్సీ ప్రాంతాల్లో మహిళల వెదురు ఉత్పత్తులతో ఆర్థికంగా అభివృద్ధి సాధించేలా మరియు ఫారెస్ట్ ప్రొడ్యూసర్ కంపెనీ ఏర్పాటుకు సంబంధించిన ఓరియెంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమం జరిగింది. ఈ ట్రైనింగ్ లో ముఖ్య అతిథిలుగా ఐటిడిఎ అధికారులు, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అధికారులు సబ్ డి ఎఫ్ ఓ సుబ్బారెడ్డి వెలుగు డిపార్ట్మెంట్ ఎస్ ఇ ఆర్ పి ఎపిడి దేగాలయ్య, ఎంపీడీఓ ఎవివి కుమార్ ,వెదురు మరియు చిన్నతరహా అడవి ఉత్పత్తులు ఎలా సేకరించాలి అనే విషయాలు పై వివరించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు, గిరిజన మహిళలు, పెసా కమిటీ ప్రసిడెంట్లు,ఐ ఎస్ బి టీమ్ జిల్లా కార్యదర్శి,జె బాబు మరియు క్లస్టర్ కోఆర్డినేటరులు సత్యప్రసాద్, హారిక, సాయికిశోర్, భార్గవ్ లు పాల్గొన్నారు.

# 'ఐబొమ్మ' క్లౌడ్‌లో 21 వేల సినిమాలు.. విచారణలో విస్తుపోయే నిజాలు!




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' కేసులో విచారణ వేగవంతమైంది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన నిర్వాహకుడు ఇమంది రవిని హైదరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు మరోసారి కస్టడీలోకి తీసుకున్నారు. చంచల్‌గూడ జైలులో ఉన్న అతడిని బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయానికి తరలించి విచారణ చేపట్టారు. ఈ విచారణలో విస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. విచారణ సందర్భంగా ఐబొమ్మ వెబ్‌సైట్ కోసం డేటాను ఎలా నిర్వహించాడు, పైరసీకి అనుసరించిన పద్ధతులపై అధికారులు లోతుగా ప్రశ్నించినట్లు సమాచారం. ఈ క్రమంలో నిందితుడి యూజర్ ఐడీ, పాస్‌వర్డ్‌తో క్లౌడ్ సర్వర్‌ను తెరిచి చూడగా, అందులో ఏకంగా 21 వేల పైరసీ సినిమాలు భద్రపరిచి ఉన్నట్లు గుర్తించి అధికారులు నివ్వెరపోయారు. అలాగే రవి ఈ-మెయిల్‌ను పరిశీలించగా, ఐబొమ్మ వెబ్‌సైట్‌కు సంబంధించిన డొమైన్లను కొనుగోలు చేసిన బిల్లులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఆధారాలు కేసులో కీలకం కానున్నాయి. నిందితుడిని మరో రెండు రోజుల పాటు విచారించాల్సి ఉందని, ఈ విచారణలో మరిన్ని విషయాలు బయటపడే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

# గ్రామ పంచాయతీ ఎన్నికలు.. రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారు




**హైదరాబాద్, పతాకం న్యూస్:** తెలంగాణలో గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటన ఖరారైంది. డిసెంబర్ 1వ తేదీ నుంచి ఆయన ఒక్కో రోజు ఒక్కో జిల్లాలో పర్యటించనున్నారు. డిసెంబర్ 1 నుంచి 6వ తేదీ వరకు ఆయన పర్యటన కొనసాగనుంది. డిసెంబర్ 1న మహబూబ్ నగర్ జిల్లాలోని మక్తల్, డిసెంబర్ 2న ఖమ్మం జిల్లాలోని కొత్తగూడెం, డిసెంబర్ 3న కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్, డిసెంబర్ 4న ఆదిలాబాద్, డిసెంబర్ 5న నర్సంపేట, డిసెంబర్ 6న నల్గొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతాల్లో ఆయన పర్యటన సాగుతుంది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల కమిషన్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది. మూడు దఫాలుగా ఎన్నికలు జరగనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని వెల్లడించారు. మొదటి దశ నామినేషన్లు నవంబర్ 27న ప్రారంభం కాగా పోలింగ్ డిసెంబర్ 11వ తేదీన జరగనుంది. రెండవ దశ నామినేషన్లు నవంబర్ 30న, మూడవ దశ నామినేషన్లు డిసెంబర్ 3న ప్రారంభం కానుండగా, రెండో దశ పోలింగ్ డిసెంబర్ 14న, మూడో దశ పోలింగ్ 17న జరగనుంది.

# ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం.. రంగోలి పోటీలతో అవగాహన కార్యక్రమం



**అరకులోయ, పతాకం న్యూస్ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకు వ్యాలీలో కమిషనరేట్ ఆఫ్ కాలేజ్ ఎడ్యుకేషన్ ఆంధ్రప్రదేశ్ ఆదేశాల మేరకు రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకొని రంగోలి పోటీలు విద్యార్థులకు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం విద్యార్థులలో ఎయిడ్స్ అవగాహనను పెంచేందుకు ఉపయోగపడింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడుతూ, "ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఎయిడ్స్ వ్యాధి గురించి సమగ్ర అవగాహన కలిగి ఉంటూ, తమ గ్రామాల్లో ప్రజలకు కూడా దాని గురించి తెలియజేయాలి. నిర్మూలనకు అందరూ కలిసి పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ పి. కొండబాబు, మెంబర్లు పి. సుందరి రాణి, ఎం. అనిత కుమారి, అధ్యాపకులు మరియు భారీ సంఖ్యలో విద్యార్థులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# మహాత్మ జ్యోతిరావు పూలే జీవితం స్ఫూర్తిదాయకం: ఎమ్మెల్యే పల్లా



**గాజువాక, పతాకం న్యూస్:** గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే 135 వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు , శాసన సభ్యులు పల్లా శ్రీనివాసరావు హాజరయ్యారు. ముందుగా మహాత్మ జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ బీసీ లకు,బడుగు బలహీన వర్గాలకు ఆరాధ్య దైవం, ప్రత్యేకంగా స్త్రీ లకు విద్యాదాత, మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు. మహాత్మ జ్యోతిరావు పూలే జీవితాన్ని స్ఫూర్తిదాయకంగా తీసుకొని ప్రతిఒక్కరు ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమానికి గాజువాక నియోజవర్గం సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు సభాధ్యక్షులుగా వ్యవహరించారు.

గాజువాక నియోజకవర్గం బీసీ సెల్.ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. మార్కెటింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రాంబాయి ,బీసీ సెల్ అధ్యక్షులు తమిరె శివ ప్రసాద్, బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి డీవీ. సత్యారావు, గాజువాక నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి భవాని,నాయకులు అరుణ్ కుమార్, సభాధ్యక్షులుగా,పోలారావు, 85 వార్డు అధ్యక్షులు కర్రి దశంద్ర , మైనార్టీ విభాగ అధ్యక్షులు షేక్ రెహమాన్, గంధం యజ్ఞప్రియ ,జ్యోతి, స్వాతి , కిల్లాడి సంతోష్ కుమారి, గల్లా హనిత్, శ్వేత కుమారి,తదితరులు పాల్గొన్నారు.

# రైతన్న సేవలో... మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్



**కురుపాం, పతాకం న్యూస్ :** కురుపాం నియోజకవర్గం గరుగుబిల్లి మండలం, నందివానివలస గ్రామంలో టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మరడాన నారాయణ స్వామి నాయుడు ఆధ్వర్యంలో "రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు కురుపాం శాసనసభ్యురాలు తోయక జగదీశ్వరి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేస్తూ అన్నదాతలకు మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను కూటమి ప్రభుత్వం ప్రకటించింది. సాగునీటి యాజమాన్యంలో మేటి, 90% సబ్సిడీపై బిందు సేద్యం, సబ్సిడీపై మెలైన విత్తనాలు, ఉద్యాన రైతులకు ఉజ్వల భవిత, పొలం పిలుస్తుంది, ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ యాంత్రీకరణ, పాడి రైతులకు ప్రభుత్వ ప్రోత్సాహం, ఆక్వా రైతులకు విద్యుత్ రాయితీ, సంచార రైతు బజార్లు వంటి అంశాలపై రైతులకు అవగాహన పరచడం జరిగింది. ప్రతి రైతును భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా, కూటమి ప్రభుత్వం రైతులకు అందించిన సంక్షేమం మరియు ముఖ్యంగా అన్నదాత సుఖీభవ రెండు విడతల ప్రయోజనాలను గురించి వివరించి, రైతుల అభిప్రాయాలను తెలుసుకోవడం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ ఉరిటి రామారావు, రాష్ట్ర నాటక రంగ డైరెక్టర్ అంబటి రాంబాబు, నాయకులు మరడాన తవిటినాయుడు, మత్రాపు పురుషోత్తం నాయుడు, సత్యనారాయణ, శంకర్రావు జిల్లా అధికారులు, సచివాలయం సిబ్బంది, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# నాణ్యత పేరుతో పత్తి కొనుగోలు చేయని సీసీఐ అధికారులు



**నంద్యాల, పతాకం న్యూస్ :** నంద్యాల జిల్లా కేంద్రంలోని మురారి కాటన్ మిల్లులో ఏర్పాటు చేసిన కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాణ్యత ప్రమాణాల పేరుతో గత రెండు రోజుల నుండి పత్తి కొనుగోలు చేయకుండా రైతుల్ని ఇబ్బంది పెడుతున్నారు. దీంతో రైతులు ఆగ్రహించి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం పార్టీ నాయకులను కలిశారు. విషయం తెలుసుకున్న నాయకులు సీసీఐ కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఉదయం నుండి సీసీ ఐ అధికారులను బయటికి వెళ్ళనివ్వకుండా లోపలనే అడ్డగించి, ఎలాంటి షరతులు లేకుండా, కొనుగోలు కేంద్రానికి తెచ్చిన మొత్తం పత్తిని రైతుల నుండి కొనుగోలు చేయాలని రైతులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి టి, రమేష్ కు మార్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి టి .రామచంద్రుడు, జిల్లా కమిటీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, సిపిఎం జిల్లా నాయకులు నరసింహ నాయక్, వి .బాల వెంకట్, పి.నరసింహ, కృష్ణ తదితరులు రైతులకు అండగా నిలబడి రైతులకు భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్, టి. రామచంద్రుడులు మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పత్తి కొనుగోలు కోసం పెట్టిన షరతుల వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతున్నదని, స్లాట్ బుకింగ్ పేరుతో పది రోజులు కాలయాపన జరిగిందని తీరా కొనుగోలు కేంద్రాలకు పత్తిని తెచ్చిన తర్వాత నాణ్యత పేరుతో అధికారులు వెహికల్స్ వెనక్కి తిప్పి పంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. సిసిఐ అధికారులు మధ్య దళారులు ఇచ్చే కమీషన్లకు ఆశపడి నాణ్యతగా ఉన్న పత్తిని కూడా బాగోలేదంటూ రిజెక్ట్ చేస్తుండడం దుర్మార్గమైనచర్యగా అభివర్ణించారు. సుదూర ప్రాంతాల నుంచి కొనుగోలు కేంద్రంకు వచ్చిన వెహికల్ బాడుగలు, భోజనం ఖర్చులు, లోడింగ్ అన్లోడింగ్ ఖర్చులు, వీటన్నిటితో పాటు స్లాబుల పేరుతో రేటులో మోసం ఫలితంగా రై తాంగం తీవ్రంగా నష్టాల పాలవుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తి కొనుగోలు నిబంధనలను సడలించాలని, సిసిఐ పెట్టే నిబంధనలన్నింటిని రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని కేంద్రంతో మాట్లాడి రద్దు చేయించాలని, రైతాంగం పండించిన మొత్తం పత్తిని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

# డోలీ కట్టి.. నాలుగు కిలోమీటర్లు మోసుకెళ్లి రోగిని రక్షించిన గిరిజనులు



**పార్వతీపురం, పతాకం న్యూస్ :** డోలి కట్టి.. నాలుగు కిలోమీటర్లు రోగిని మోసుకెళ్లి గిరిజనులు రక్షించారు. పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తోలుంగూడకు రహదారి సౌకర్యలేమితో మరోసారి తీవ్ర సమస్య ఏర్పడింది. ఈ గ్రామానికి చెందిన మండంగి కింబప్పు నాలుగు రోజులుగా జ్వరంతో బాధపడుతూ ఆరోగ్యం క్షీణించింది. ఈ గ్రామానికి వాహనాలు వచ్చే మార్గ లేకపోవడంతో కుటుంబ సభ్యులు నాడు డోలికట్టి సుమారు నాలుగు కిలోమీటర్ల కొండదారిలో గంట పాటు శ్రమించి రోగిని కొండ దిగువకు తీసుకొచ్చారు. అనంతరం నీలకంఠాపురం పిహెచ్‌సికి తరలించారు. ఈ నేపథ్యంలో గ్రామస్తులు మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో ప్రాణాలను ప్రమాదంలో పెట్టి ఇలా డోలి మోస్తూ కొండ ఎగువకు రావాల్సి వస్తోందని, వెంటనే తోలంగూడకు రహదారి నిర్మించాలని గిరిజనులు కోరుతున్నారు. ఈ ఒక్క గ్రామమే కాకుండా గిరిశిఖర గ్రామాల వారంతా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఈ సమస్యపై వెంటనే చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

# పోలవరం లేకుండా పోలవరం జిల్లా ఇవ్వడమేంటీ: ఆదివాసీపార్టీ



**జీకే వీధి, పతాకం న్యూస్ :** అల్లూరి జిల్లా జీకేవీధి మండలం పోలవరం నియోజకవర్గం లేకుండా పోలవరం జిల్లా ఇవ్వడమేంటని భారత్ ఆదివాసీపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మొట్టడం రాజబాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీసారు రాజబాబు మాట్లాడుతూ జాతీయ ప్రాజెక్ట్ అయినా పోలవరం జిల్లా పేరు పెట్టి పోలవరం నియోజవర్గం లేదా పోలవరం నియోజవర్గం పరిధి అయినా కె ఆర్ పురం డివిజన్ లో పోలవరం ప్రాజెక్ట్ ముంపు మండలాలతో పాటు షెడ్యూల్డ్ ప్రాంతం ఉండగా వాటిని విస్మరించడాన్ని ఆదివాసీలే కాకుండా రాష్ట్ర ప్రజలు కూడా నివ్వెర పోయారని,గతంలో చంద్రబాబు నాయుడు పోలవరం ప్రాజెక్ట్ పరిశీలనకు వచ్చి పోలవరం జిల్లా ఇస్తానని హామీ ఇచ్చారని,హామీలివ్వడమే తప్పా అమలు చేయడంలో చంద్రబాబు డొల్లతనం మరొక్కసారి రుజువైందని,జిఓ 3ని ఇస్తానని ఆదివాసీలకు ఇచ్చినహామీ నెరవేర్చని చంద్రబాబు మరొక్కసారి పోలవరం జిల్లా విషయంలో ఆదివాసీల ఆశలు అడియాసలు చేసారని,ఇప్పటికీ సమయముంది కనుక మరొక్కసారి పునరాలోచన చేసి పోలవరం జిల్లాలోకి కెఆర్ పురం డివిజన్ని కూడా కలిపాలని,పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు గట్టిగా కృషి చేస్తే పెద్ద కష్టం కాదని,కృషి చేయకపోతే చరిత్ర హీనుడిగా మిగిలిపోతారనే విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని హెచ్చరిస్తూ,పోలవరం నియోజకవర్గానికి చెందిన రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ తో పాటు పోలవరం ప్రాంత కూటమి నాయకులు కూడా గట్టిగా కృషి చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో భారత్ ఆదివాసీపార్టీ నాయకులు మద్దేటి అంజిరెడ్డి,పండా కృష్ణమూర్తి, కురసం సత్యనారాయణ దొర, బలిజే చిన్నారెడ్డి, కుంజం తమ్మన్న దొర,నక్కెల శ్రీనివాస్ రావు, కత్రం రామదాసు దొర, మడకం వెంకన్న దొర తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి ఉత్సవంలో మోడేకుర్తి సేవలు

**విశాఖపట్నం, పతాకం న్యూస్ :** విశాఖపట్నం లో గల ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పు శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి మార్గశిరమాస ఉత్సవాలలో భాగంగా తొలి గురువారం సందర్భంగా గాజువాక కు చెందిన మోడేకుర్తి వీర వెంకట సత్యనారాయణ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి స్వచ్ఛందంగా గురువారం ఉదయం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు 15 గంటలపాటు పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టమ్ మైక్ ద్వారా అనౌన్సర్ గా భక్తులకు సూచనలు,జాగ్రత్తలు,తప్పిపోయిన వారి వివరాలు చెబుతూ తన స్వచ్ఛందసేవ ను అందించి పోలీస్ మరియు దేవస్థానం అధికారుల ప్రశంసలు పొందారు. సత్యనారాయణ గతంలో కూడా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామివారి క్షేత్రంలో చందనోత్సవం, గిరిప్రదక్షిణ వంటి ఉత్సవాలలోనూ , అప్పికొండ క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భగానూ,అన్నవరం శ్రీ వీరవేంకట సత్యనారాయణ స్వామివారి కల్యాణోత్సవాలలోనూ,అరసవిల్లి క్షేత్రంలో రథసప్తమి ఉత్సవం సందర్భంగానూ స్వచ్ఛందంగా పబ్లిక్ అనౌన్స్మెంట్ సిస్టమ్ మైక్ ద్వారా భక్తులకు సూచనలు ,జాగ్రత్తలు చెబుతూ భక్తులు, అధికారుల ప్రశంసలు పొందారు.

## ఓటు హక్కుకు ఆధార్ ధ్రువీకరణ కాదు: సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** వయోజన ఓటు హక్కు పొందేందుకు ఆధార్ ధ్రువీకరణ పత్రం కాబోదని, అది కేవలం సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేసింది మాత్రమేనని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కసరత్తుపై ఎన్నికల సంఘం (ఇసి) నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోరుమల్యా బాగ్చి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా పౌరసత్వానికి ఆధార్ ధ్రువీకరణ పత్రం కాదని స్పష్టం చేసింది. 'ఆధార్ సామాజిక సంక్షేమ ప్రయోజనాలు అందరికీ చేరేలా చూసుకోవడానికి ఏర్పాటుచేసింది మాత్రమే. రేషన్ కోసం ఆధార్ పొందిన వ్యక్తిని.. ఓటర్‌ను చేయాలా? విదేశాలకు చెందినవారు ఇక్కడ కార్మికుడిగా పనిచేస్తే.. వారికి కూడా ఓటు హక్కు కల్పించాలా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. ఓటరు నమోదు ఫారం-6లో పేర్కొన్న వివరాలు సరైనవో, కావో నిర్ధరించుకునే అధికారం ఇసికి ఉందని పేర్కొంది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్‌లో సర్ నిర్వహించడాన్ని ప్రత్యేకంగా సవాల్ చేసిన పిటిషన్ల విచారణకు సుప్రీం షెడ్యూల్ చేసింది. డిసెంబరు 1లోపు వీటిపై స్పందన తెలియజేయాలని ఇసిని ఆదేశించింది. తరువాత తదుపరి విచారణను డిసెంబర్ 2కి ధర్మాసనం వాయిదా వేసింది. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ..ఎస్ఐఆర్ ప్రక్రియ సాధారణ పౌరులపై రాజ్యాంగ విరుద్ధమైన భారాన్ని మోపుతుందన్నారు. దీనివల్ల నిరక్షరాస్యులు తమ ఓటు హక్కు కోల్పోయే ప్రమాదముందన్నారు. ఈ మొత్తం ప్రక్రియ ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే ఒక వ్యక్తికి మానసిక స్థితి సరిగా లేకపోతే బిఎల్‌వో తీర్పు చెప్పగలరా? చట్టం పరిధికి వెలుపల ఉన్న అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు ఈ హక్కును నిర్ణయించ కూడదు. అందుకే ఇది అసమంజసమైనదని కపిల్ వాదించారు.

పిటిషనర్ల తరపున మరో సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి వాదనలు వినిపిస్తూ ఆర్టికల్ 324 నుండి ఎన్నికల సంఘం తీసుకున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో కొన్నింటికి అనుమతి లేదని, అధికార పరిధి లేదని వాదించారు. దీనికి సిజెఐ సూర్యకాంత్ జోక్యం చేసుకుని ఎన్నికల సంఘానికి ఎప్పటికీ ఎస్ఐఆర్ అధికారం ఉండదా? అని ప్రశ్నించారు. ఇది సాధారణ నవీకరణ కాదని, ప్రత్యేక సవరణ జరుగుతుందని అన్నారు. అందుకే ఈ ప్రక్రియను సమర్థించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. దీనికి సింఘ్వి బదులు ఇస్తూ గత ఆరు నెలల్లో ఎస్ఐఆర్ ప్రక్రియకు ఈ కోర్టు చాలా మెరుగులు దిద్దిందని, కానీ చట్టం కానిది చట్టంగా మిగిలిపోయిందని అన్నారు. ఎస్ఐఆర్ వంటి ఏ ప్రక్రియనైనా నిర్వహించే ముందు రాజ్యాంగాన్ని అనుసరించాలని సింఘ్వి ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

## అంతర్జాతీయ డిజిటల్ ముఠా గుట్టు రట్టు.. 13 మంది అరెస్టు



**భీమవరం, పతాకం న్యూస్:** అంతర్జాతీయ డిజిటల్ ముఠాను పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పోలీసులు అరెస్టు చేశారు. మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.61,35,231 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను ఎస్పి అద్నాన్ నయీం అస్మి గురువారం విలేకరులకు వెల్లడించారు. భీమవరం టూ టౌన్ పరిధిలో నివాసం ఉంటున్న రిటైర్డ్ ప్రొఫెసర్‌కు ఈ నెల 17న కొందరు వ్యక్తులు ఫోన్ చేసి అతని బ్యాంకు ఖాతా నుంచి రూ.78.6 లక్షలు మాయం చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కార్డు డీల్ పద్ధతిలో ముంబైకు చెందిన రహతే జే నయన్ అనే వ్యక్తి కాంబోడియాలో డిజిటల్ నేరాలకు పాల్పడుతున్నాడు. బ్యాంకు ఖాతా వ్యక్తికి ఫోన్ చేసి మాయమాటలతో అతని అకౌంట్ నుంచి డబ్బులు ఖాళీ చేసి, వాటిని కమిషన్ల పద్ధతిలో ముఠా బ్యాంకు ఖాతాలకు వేస్తారు. వీరు కమిషన్ తీసుకుని మిగిలిన సొమ్మును కంబోడియా వ్యక్తికి జమ చేస్తారు. అయితే అదే సాంకేతికతను ఉపయోగించిన పోలీసులు ముఠాలోని 13 మందిని విజయవాడలో అరెస్ట్ చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. వీరి వద్ద నుంచి రూ.42 లక్షలు నగదు, వివిధ బ్యాంక్ ఖాతాల్లో ఉన్న రూ.19,35,231 నగదు సీజ్ చేసినట్లు ఎస్పి తెలిపారు. అంతర్జాతీయ సిమ్ కార్డులతో కూడిన 15 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## శివాలయం కొండపైకి వెళ్ళే నూతన మార్గాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిరీషదేవి



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** రాజవొమ్మంగి మండల కేంద్రంలో స్థానిక శివాలయం కొండపైన గల శివాలయానికి వెళ్ళే మార్గాన్ని ప్రజల సౌకర్యార్థం మండల పరిషత్ గ్రాంట్ నుండి 6 లక్షల రూపాయలు, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, రాజవొమ్మంగి 2 కనిగిరి గంగాదుర్గ ల ఇరువురికి చెరో 3 లక్షలచప్పున మంజూరు చేయగా ఆ నిధులతో పాటుగా పంచాయితీ సర్పంచ్ గొల్లపూడి రమణి పంచాయి గ్రాంట్ నుండి 4 లక్షల రూపాయలు వెరసి 10 లక్షల రూపాయలతో వేసిన సిమెంట్ రోడ్ ను శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి కూటమి సభ్యుల సమక్షంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు,కార్యకర్తలు,కూటమి నాయకులు,అభిమానులు పెద్దయెత్తున పాల్గొన్నారు.

# నిబంధనల సడలింపుపై స్పందించని కేంద్రం

## ఆంక్షలతో సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి రైతుల ఇక్కట్లు



**గుంటూరు, పతాకం న్యూస్:** పత్తి కొనుగోలుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా రూపొందించిన నిబంధనలు సడలించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా ఇప్పటి వరకు సానుకూల స్పందన రాలేదు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న టిడిపి కూటమి ప్రభుత్వం గత ఏడాది కాలంలో రైతులకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసినా ఫలితం కనిపించడం లేదు. ఈ ఏడాది మార్చిలోనే మిర్చి రైతులకు సాయం అందిస్తామని చెప్పిన కేంద్రం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. ధరలు తగ్గి ఒక్కో రైతు సగటున రూ.లక్ష వరకు నష్టపోయారు. కానీ, ఇటీవల గుంటూరు వచ్చిన వ్యవసాయ శాఖ మంత్రి శివరామ సింగ్ చౌహాన్ మాత్రం రాష్ట్రంలో మిర్చి రైతులను ఆదుకున్నామని గొప్పగా ప్రకటించారు. తాజాగా, పత్తి కొనుగోలులో రైతులకు సిసిఐ నిబంధనలు తీవ్ర ప్రతిబంధకంగా మారాయి. రాష్ట్రంలో 11 మార్కెట్ కమిటీల పరిధిలో 64 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోలు కేంద్రాలను సిసిఐ ప్రారంభించింది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రాష్ట్రంలో 5.40 లక్షల ఎకరాల్లో పత్తి సాగైంది. దాదాపు ఎనిమిది లక్షల క్వింటాళ్ల ఉత్పత్తి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు.

సిసిఐ ద్వారా ఇప్పటి వరకు నాలుగు వేల మంది రైతుల నుంచి 90 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. పత్తి విక్రయానికి అనేక ఆంక్షలు కొనసాగుతున్నాయి. ఇ-క్రాప్‌లో నమోదు నమోదై ఉండాలి. దీంతోపాటు రైతు సేవా కేంద్రంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద పేరు నమోదు చేసుకోవాలి. సిఎం యాప్, కపాస్ కిసాన్ యాప్‌లో పేర్లు నమోదు చేశాక సమీప కొనుగోలు కేంద్రంలో ఉన్న జిన్నింగ్ మిల్లులకు పత్తిని తీసుకొని వెళ్లాలి. ఎనిమిది శాతం నుంచి 12 శాతం తేమ ఉంటే మూడు కేజీలు తరుగు పెడుతున్నారని రైతులు వాపోతున్నారు. 12 శాతం మించి తేమ ఉంటే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాప్‌లో స్లాట్ బుకింగ్ నిబంధన, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వకపోవడం వల్ల పత్తిని అమ్ముకునేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. ఎకరాకు ఏడు క్వింటాళ్లను మాత్రమే కొనాలన్న నిబంధన రైతులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎకరాకు గరిష్టంగా 12 నుంచి 15 క్వింటాళ్లు దిగుబడి వచ్చే అవకాశం ఉండగా, మొత్తం దిగుబడిలో సగం కొనుగోలు చేస్తే మిగతా పత్తి ఎక్కడ అమ్ముకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతం ఎనిమిది నుంచి 12 శాతం వరకు ఉన్నా కనీస మద్దతు ధర రూ.8,110 ఇవ్వడం లేదని రైతులు చెబుతున్నారు. అంతే కంటే ఎక్కువగా తేమ శాతం ఉంటే కొనుగోలు చేయడం లేదు. ఆరబెట్టి తీసుకురావాలని అధికారులు తెగేసి చెప్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతోపాటు ప్రస్తుతం మంచు కురుస్తున్నందున 15 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా అనుమతించాలని రైతులు కోరుతున్నారు. ఆరబెట్టుకునేందుకు తగిన స్థలం లేదని చెప్తున్నారు. పత్తి కొనుగోలుకు కపాస్ కిసాన్ యాప్‌లో నమోదు చేసుకోవాలనే నిబంధనను రద్దు చేయాలని కోరుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పత్తిని కొనుగోలు చేస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని, సిసిఐ నిబంధనల సడలింపునకు కేంద్రంతో చర్చలు వేగవంతం చేశామని మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న యాప్ విధానం మార్చాలని, 12 నుంచి 18 శాతం వరకు తేమ శాతం ఉన్నా కొనుగోలు చేయాలని కోరామని మంత్రి ప్రకటించినా ఇప్పటి వరకు కేంద్రం నుంచి స్పందన లేదు.

# పార్వతీపురం జిల్లాలో ధాన్యం సేకరణలో జాప్యం

**పార్వతీబీపురం పతాకం న్యూస్:** జిల్లాలో ధాన్యం కొనుగోలు బ్రహ్మాండంగా జరుగుతున్నాయని.. గత ఏడాది కంటే వేగవంతంగా కొనుగోలు చేస్తున్నామని అధికారులు గొప్పలు చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతుంది. ఈ ఏడాది 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు లక్ష్యం కాగా, ఇప్పటివరకు 7,800 మెట్రిక్ టన్నులు మాత్రమే కొనుగోలు జరిగాయి. గత ఏడాది ఇదే సమయానికి 9వేల మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారు. ప్రభుత్వం మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తున్నా రైతులు మాత్రం వ్యాపారులకు అధికంగా విక్రయిస్తున్నారు. దీనివల్ల కొనుగోలు లక్ష్యం తగ్గుతుంది. వాస్తవానికి ప్రభుత్వం క్వింటా సాధారణ రకం ధాన్యం రూ.2,369, గ్రేడ్-1 రకం రూ.2,389 చెల్లిస్తుంది. 80కేజీల బస్తాకు సాధారణ రకం రూ.1,895, గ్రేడ్-1 రకం రూ.1,911 ధర అందిస్తుంది. శాస్త్రీయ పద్ధతిలో తేమ, ఈలింగ్ మొదలగు నాణ్యత ప్రమాణాలను పరిశీలించి అందుకు అనుగుణంగా ధాన్యం ఉంటేనే ఈ మద్దతు ధర లభిస్తుంది. అయితే, ఈ నిబంధనల కారణంగా జిల్లాలో చాలామంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. మరికొందరు రైతులు సాగు పెట్టుబడి కోసం వ్యాపారుల వద్ద ముందుగానే అప్పు చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వారికే ధాన్యం విక్రయించాల్సి వస్తోంది. వీరు కొనుగోలు చేసిన ధాన్యం ఇతర జిల్లాల్లోని మిల్లులకు తరలి వెళు తున్నాయి. మరికొన్ని గ్రామాల్లో దళారులు రంగ ప్రవేశం చేసి రైతులను దోచుకుంటున్నారు. రైతుల వద్ద తక్కువ ధరకు కొనుగోలు చేసి తమకు నచ్చిన వ్యాపారికి నచ్చిన రేటుకు విక్రయించుకుంటున్నారు. ప్రస్తుతం రైతుల ఆర్థిక అవసరాలు దళారుల పాలిట కాసుల పంటగా మారింది. మిల్లర్లు తమ బ్యాంకు గ్యారెంటీలను ఇప్పటివరకు



రూ.25 కోట్ల వరకే అందించారు. జిల్లాలో 104 రైస్ మిల్లులు ఉన్నాయి. ఇందులో కేవలం 50 మిల్లులు మాత్రమే బ్యాంకు గ్యారెంటీలు అందించాయి. బ్యాంకు గ్యారెంటీలు రూ.200కోట్లు రావాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ కేవలం రూ.25 కోట్లు మాత్రమే వచ్చాయంటే ధాన్యం కొనుగోలు పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతోంది. ఇలా అయితే ప్రభుత్వ లక్ష్యాలు ఏ విధంగా నెరవేరుతాయో అధికారులకే తెలియాలి. ఇప్పటికైనా ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది.

# థాయ్‌లాండ్‌ను ముంచెత్తిన వరదలు... 145 మంది మృతి



**థాయ్‌లాండ్:** దక్షిణ థాయ్‌లాండ్‌లో సంభవించిన తీవ్ర వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో మరణించిన వారి సంఖ్య 145కి చేరినట్లు అధికారులు శుక్రవారం వెల్లడించారు. అసోసియేటెడ్ ప్రెస్ కథనం ప్రకారం, కొన్ని రోజులుగా కురుస్తున్న కుండపోత వర్షాల కారణంగా 12 దక్షిణ ప్రావిన్సుల్లోని 12 లక్షల కుటుంబాలకు చెందిన సుమారు 36 లక్షల మంది ప్రజలు తీవ్రంగా ప్రభావితమయ్యారు. వరద నీరు నెమ్మదిగా తగ్గుముఖం పడుతుండటంతో సహాయక చర్యలు ముమ్మరం చేసినట్లు విపత్తు నివారణ శాఖ తెలిపింది. ప్రభుత్వ అధికార ప్రతినిధి సిరిపాంగ్ అంగ్‌కాసాకుల్కియాట్ మాట్లాడుతూ... ఎనిమిది ప్రావిన్సుల్లో 145 మంది మరణించగా, ఒక్క సోంగ్‌ఖ్లా ప్రావిన్స్‌లోనే 110 మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. ముఖ్యంగా, ఆ ప్రాంతంలోని అతిపెద్ద నగరమైన హ్యాట్ యాయ్‌లో వరద తగ్గాక, శిథిలాల కింద చిక్కుకున్న మరిన్ని మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీస్తున్నాయి. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ప్రధాని అనుతిన్ చార్న్‌విరాకుల్ సోంగ్‌ఖ్లాలో అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. ఇది మునుపెన్నడూ చూడని విపత్తు అని ఆయన అభివర్ణించారు. స్థానిక ఆసుపత్రులపై భారం తగ్గించడానికి హ్యాట్ యాయ్ హాస్పిటల్ కోసం ప్రత్యేకంగా ఎనిమిది ఫీల్డ్ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. అత్యవసర వైద్యం అవసరమైన 20 మంది రోగులను గురువారం హెలికాప్టర్ల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలించారు. హ్యాట్ యాయ్ జిల్లాలో ఏర్పాటు చేసిన 16 పునరావాస కేంద్రాలకు 16,000 మందికి పైగా ప్రజలను తరలించినట్లు అధికారులు తెలిపారు. గతవారం కేవలం మూడు రోజుల్లోనే హ్యాట్ యాయ్, దాని పరిసర ప్రాంతాల్లో 630 మిల్లీమీటర్ల (25 అంగుళాలు) రికార్డు స్థాయి వర్షపాతం నమోదైంది. వరదల కారణంగా రోడ్లు కొట్టుకుపోవడం, విద్యుత్ స్తంభాలు నేలకూలడం, వాహనాలు ఒకదానిపై ఒకటి పేరుకుపోవడం వంటి దృశ్యాలు కనిపిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్ వ్యవస్థలు పూర్తిగా స్తంభించాయి. ఒకప్పుడు మార్కెట్లు, స్ట్రీట్ ఫుడ్‌తో పర్యాటకులను ఆకర్షించే హ్యాట్ యాయ్ నగరం ఇప్పుడు పూర్తిగా బురదమయంగా మారింది. ఇళ్లు, వ్యాపార సముదాయాల్లో పేరుకుపోయిన బురదను, శిథిలాలను తొలగించేందుకు స్థానికులు శ్రమిస్తున్నారు.

# సెల్‌ఫోన్లలో బాల్యం బందీ

## మొబైల్ వాడకం వల్ల ఆలోచించే శక్తి, సృజనాత్మకత కోల్పోతారని హెచ్చరిక!



ఒకప్పుడు పిల్లల్ని ఎత్తుకుని కథలు చెబుతూ, ఆటలు ఆడిస్తూ అన్నం తినిపించేవారు. ప్రస్తుతం ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులకు ఆ ఓపిక, తీరిక రెండూ ఉండట్లేదు. అందుకే పిల్లల చేతిలో ఫోన్ పెట్టి, నోట్లో అన్నం పెడుతున్నారు. అంతేనా? పిల్లలు డిస్టబ్ చేయకుండా ఉండాలనుకునే ప్రతిసారీ ఫోన్ ఇచ్చేస్తున్నారు. ఇలా చేయడం వల్ల పిల్లలపై తీవ్ర దృష్ప్రభావాలు పడుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పదేళ్లలోపు పిల్లలు ఎక్కువగా ఎఫెక్ట్ అవుతున్నారని చెబుతున్నారు. అతిగా ఫోన్? వాడకం వల్ల స్వతహాగా ఆలోచించే శక్తి, సృజనాత్మకతను కూడా కోల్పోతున్నారని అంటున్నారు. ఈ క్రమంలో పిల్లల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నిపుణులు సూచిస్తున్నారు. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం!

సెల్‌ఫోన్‌కు అడిక్ట్ అయిన పిల్లల్లో కళ్లు లాగడం, నీళ్లు కారడం, ఎర్రగా అవ్వడం, మంట, తలనొప్పి వంటి ఎన్నో సమస్యలు తలెత్తుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పరీక్షిస్తే అప్పటికే వారికి దృష్టిలోపం ఉంటోందని చెబుతున్నారు. అయితే.. నాలుగేళ్లలోపు పిల్లలు తమకు ఎదురయ్యే ఇలాంటి ఇబ్బందులేవీ చెప్పలేరని అంటున్నారు . 10 ఏళ్లలోపు పిల్లల్లో సగం మంది దృష్టి లోపం సమస్యలను ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. 8 ఏళ్ల వయసు వరకు పిల్లల్లో కన్ను అభివృద్ధి చెందుతూ ఉంటుందని, ఈ సమయంలోనే వారి కంటిపై తీవ్ర ప్రభావం పడుతోందని అంటున్నారు. ఫోన్ నుంచి వచ్చే వెలుతురు ప్రభావం కన్ను పెరుగుదలపై పడుతుందని, దీంతో రెటీనా దెబ్బ తింటుందని హెచ్చరిస్తున్నారు.

చలికాలంలో తీవ్ర ఒళ్లు నొప్పులా? - ఈ జాగ్రత్తలు తీసుకుంటే మంచిదంటున్న నిపుణులు!

ఫోన్ ఇస్తేనే తింటా, పాఠశాలకు వెళ్తా, పడుకుంటామని పిల్లలు మారాం చేస్తున్నారంటూ తల్లిదండ్రులు వస్తుంటారు. ఫోన్ వాడకుండా మార్గాలు చెప్పమంటారు. మీ కళ్లు పనిచేయవని చెప్పినా చిన్నారులకు అర్థమయ్యే వయసు కాదు. కాబట్టి, తల్లిదండ్రులే జాగ్రత్తలు తీసుకోవాలి. ముందు నుంచే ఫోన్ ఇవ్వకుండా ఉండాలి. చిన్న వయసులోనే కంటి సమస్యలు గురిస్తే, వారి చూపును కాపాడవచ్చు. - డాక్టర్ లింబాద్రి, కంటి వైద్య నిపుణుడు

పిల్లలు అదే పనిగా ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్‌లలో రీల్స్, షాట్స్ వీడియోలను చూస్తున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుంది. దీంతో ఆరోగ్యం దెబ్బ తినడంతోపాటు తీవ్రమైన కంటి సమస్యలు పెరుగుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ఈ సమస్య అన్ని వయసుల వారిలోనూ ఉందని, మరి ముఖ్యంగా చిన్నారులు, యువతలో దృష్టిలోపాలు పెరుగుతున్నాయంటున్నారు. అధిక స్క్రీన్ టైంతో కంటిపై పడే డిజిటల్ ఒత్తిడి ఓ నిశబ్దపు మహమ్మారిగా కంటి చూపును దెబ్బతీస్తుందని హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా రీల్స్ చూస్తూ గంటల తరబడి ఎలక్ట్రానిక్ పరికరాలకు అతుక్కుపోవడంతో పిల్లల్లో కళ్లు పొడిబారిపోవటం, హ్రస్వ దృష్టి పెరగటం, కళ్లు ఒత్తిడికి గురికావడంతో పాటు చిన్న వయస్సులోనే మెల్లకన్ను రావటం వంటి కేసులు గణనీయంగా పెరుగుతున్నాయని తెలియజేస్తున్నారు. అంతేకాకుండా, పిల్లలు మొబైల్ వాడకం వల్ల నిరాశ, ఆందోళన, ప్రవర్తనా సమస్యలతో సంబంధం కలిగి ఉండవచ్చని అధ్యయనం పేర్కొంది.

ఫోన్‌ను పూర్తిగా దూరం ఉంచాలి. రకరకాల రంగులున్న పుస్తకాలు, ఆట వస్తువులు ఇవ్వాలి.

ఫోన్? కాకుండా ఇంకా వేటిపై ఆసక్తి చూపిస్తున్నారో గుర్తించి, అటు వైపు ప్రోత్సహించాలి. మనం ఊరికే ఫోన్ వాడితే వారు అదే కావాలంటుంటారు. కాబట్టి మనమూ మారాలి. వీలైనంత వరకు మైదానాలకు తీసుకెళ్లాలి. శారీరక శ్రమ ఉండేలా చూడాలి.

చిన్నప్పటి నుంచే ఆటలు, నృత్యం వంటి వాటిలో ప్రోత్సహించాలి.

# నిజంగా సబ్బు శరీర రంగును మార్చగలదా?



సబ్బులు మన చర్మంపై ఉన్న మురికి, మలినాలను తొలగించడానికి.. శరీరాన్ని తాజాగా ఉంచడానికి సహాయపడతాయని అందరికీ తెలుసు. అయితే, కొన్ని సందేహాలు కూడా ఉన్నాయి. అందులో చర్మం తెల్లగా మారడం ఒకటి! సబ్బుతో చర్మం తెల్లగా మారుతుందా? ఒకవేళ మారితే ఏ రకం సబ్బు వాడాలి? వంటి డౌట్స్ వ్యక్తం చేస్తుంటారు. వీటికి నిపుణులు ఎలాంటి సమాధానాలు చెబుతున్నారో ఇక్కడ చూద్దాం.

పొడిచర్మం ఉంటే : అలోవేరా, కొబ్బరినూనె, ఆల్?మండ్, ఆలివ్ ఆయిల్, షియా బటర్, కోకో బటర్, గ్లిజరిన్, హైల్?రోనిక్ యాసిడ్ వంటివి ఉన్న మాయిశ్చరైజింగ్ సబ్బులు వాడాలని నిపుణులు చెబుతున్నారు. ఇవి తేమను కాపాడతాయని, చర్మం బిగుసుకుపోకుండా, పొలుసులుగా మారకుండా నిరోధిస్తాయని అంటున్నారు. వీటిని ఏ చర్మం ఉన్నవారైనా శీతాకాలంలో వాడొచ్చని సిఫార్సు చేస్తున్నారు.

మీది సున్నిత చర్మమా : లిక్విడ్ ఫ్రీ క్లెన్సర్ వాడితే మంచిదంటున్నారు నిపుణులు. వీటిలో గాఢ రసాయనాలు ఉండవని చెబుతున్నారు. గ్లిజరిన్ బేస్డ్?, సెటైల్ ఆల్కహాల్, స్టైరైల్ ఆల్కహాల్, ప్రొపిలిన్ గ్లైకాల్ వంటి కాంపోనెంట్స్ ఉంటాయని, ఇవి శరీరంలోని తేమను కాపాడుతాయని, చర్మం దెబ్బతినకుండా ఉంచుతాయని వివరిస్తున్నారు. ఓట్‌మీల్, గోట్స్ మిల్స్ వంటి సున్నిత పదార్థాలు ఉన్న ఫ్రాగెన్స్ ఫ్రీ సబ్బుల్ని ఎంచుకోవాలని సూచిస్తున్నారు. కఠిన రసాయనాలు ఉన్న వాటిని దూరంగా ఉండాలని తెలియజేస్తున్నారు. అలాగే, హెర్బల్ సోప్స్ కూడా మంచివని సలహా ఇస్తున్నారు.

సాధారణ చర్మం ఉన్నవారు : కొబ్బరి నూనె, అలోవేరా తదితర సహజ పదార్థాలతో చేసే సబ్బులు మంచి ఎంపిక అని నిపుణులు సూచిస్తున్నారు.

రంగును నిర్ణయించేది జన్యువులు : తెల్లగా మారాలంటే ఎటువంటి సబ్బు వాడాలి? అనే ప్రశ్నకు నిపుణుల ఆన్సర్? వింటే ఆశ్చర్యపోవాల్సిందే. ఎందుకంటే సబ్బు వాడటం వల్ల తెలుపు రంగు రాదని స్పష్టం చేస్తున్నారు. శరీరం రంగు అనేది జన్యువుల ఆధారంగా వస్తుందని తెలియజేస్తున్నారు. అందుకే.. ఏ రంగుతో పుట్టామో, జీవితాంతం అదే ఉంటుందని చెబుతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, జాగ్రత్తలతో ఉన్న చర్మం నిగనిగలాడుతూ, ఆకర్షణీయంగా కనిపిస్తుంది తప్ప, రంగు పూర్తిగా మారదని వివరిస్తున్నారు. చర్మాన్ని కాంతివంతం చేసే సబ్బులు, క్రీముల్లో స్టెరాయిడ్లు, హైడ్రోక్వినోన్, క్యాన్సర్ కారకమైన పదార్థం, పాదరసం వంటి హానికరమైన రసాయనాలు ఉంటాయని పేర్కొంది. కాబట్టి సబ్బులు వాడితే తెల్లగా అవుతారు అనే అపోహలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.



# బీజేపీకి టాటా భూరి విరాళం..
## తెర వెనుక జరిగిందేమిటి




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ కేబినెట్ ఆమోద ముద్ర వేసిన వారాల వ్యవధిలోనే టాటా గ్రూపు బిజెపికి భారీ మొత్తంలో విరాళాలను అందచేసింది. ఈ మొత్తం రూ.758కోట్లుగా వుంది. ఇప్పటివరకు ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాల ఆధారంగా చూసినట్లైతే 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీకి అతిపెద్ద మొత్తంలో విరాళాలిచ్చిన గ్రూపుగా టాటా గ్రూపు నిలిచింది.

ఇదంతా ఎలా సాధ్యమైందంటే దేశీయంగా సెమీకండక్టర్ పరిశ్రమ నిర్మాణానికి ఊతమివ్వడంలో భాగంగా మూడు సెమీ కండక్టర్ యూనిట్లకు మోడీ ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 29న ఆమోద ముద్ర వేసింది. అందులో రెండు యూనిట్లకు టాటా గ్రూపు నేతృత్వం వహిస్తోంది. సెమీ కండక్టర్ ఉత్పత్తిని దేశంలో పెంచేందుకు గానూ వాటికి కొంత మొత్తంలో రాయితీలు ఇచ్చే పథకాన్ని ప్రభుత్వం తీసుకువచ్చింది. అందులో భాగంగా ఈ యూనిట్ల నిర్మాణంలో సగం భాగాన్ని భరించేందుకు కేంద్రం అంగకరించింది. ఆ విధంగా టాటా గ్రూపు నిర్మించబోయే రెండు యూనిట్లకు వచ్చే సబ్సిడీ ఏకంగా రూ44,203కోట్ల వరకు వుంది. అంతే కేబినెట్ సమావేశం జరిగి నాలుగు వారాలు తిరిగేసరికల్లా బిజెపికి అతిపెద్ద డోనార్‌గా టాటా గ్రూపు ఆవిర్భవించింది. రూ.758కోట్లను పార్టీకి విరాళంగా అందచేసింది. 2023-24లో రాజకీయ పార్టీలకు వచ్చిన విరాళాలన్నింటినీ అధిగమించి బిజెపి అగ్ర భాగంలో నిలిచింది. 2024-25లో మొత్తంగా టాటా గ్రూపునకు చెందిన 15 సంస్థలు దాదాపు రూ.915కోట్ల మొత్తాలను రాజకీయ విరాళాలుగా అందచేశాయి.

టాటా గ్రూపు ప్రోగ్రెసివ్ ఎలక్టోరల్ ట్రస్టు ద్వారా రాజకీయ పార్టీలకు ఈ విరాళాలు బదిలీ అవుతాయి. అన్నింటిలోకి టాటా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ అత్యధికంగా రూ.308కోట్లు అందచేసింది. 2021 నుండి 2024 వరకు రాజకీయ పార్టీలకు ఎలాంటి విరాళాలను టాటా ట్రస్టు ఇవ్వలేదు. కేవలం లోక్‌సభ ఎన్నికలకు రోజుల వ్యవధి ముందుగా అంటే గతేడాది ఏప్రిల్‌లో రూ.758కోట్లను బదిలీ చేసింది.

బిజెపి తర్వాత అధికంగా విరాళాలు అందుకున్నది కాంగ్రెస్ పార్టీనే. ఈపార్టీకి రూ.77.3కోట్లు వచ్చాయి. అంటే బిజెపి అందుకున్న దాంట్లో దాదాపు పదో వంతు. మరో 8 రాజకీయ పార్టీలు రూ.10కోట్లు చొప్పున ఈ గ్రూపు నుండి విరాళాలు అందుకున్నాయి. వాటిల్లో తృణమూల్, డిఎంకె, శివసేన, బిజూ జనతాదళ్, వైఎస్ఆర్ కాంగ్రెస్, జనతాదళ్(యునైటెడ్), లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్ ), భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) వున్నాయి.

ఇక తమిళనాడుకు చెందిన మురుగప్ప గ్రూపు మూడో కండక్టర్ యూనిట్‌ను పొందింది. ఉత్పత్తి వ్యయంలో 50శాతాన్ని కేంద్రం భరించడంలో భాగంగా ఈ సంస్థకు రూ.3501 కోట్లు సబ్సిడీగా వచ్చాయి దాంతో కొద్ది రోజుల వ్యవధిలోనే బిజెపికి మురుగప్ప గ్రూపు రూ.125కోట్లు విరాళంగా ఇచ్చిందని వెల్లడైంది. ఈ ఏడాది ప్రారంభంలో స్క్రోల్ ఇన్ వెబ్‌సైట్ పేర్కొంది. కేన్స్ టెక్నాలజీకి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ కన్ని కన్నన్ కూడా 2024-24లో రూ.12కోట్లు విరాళంగా ఇచ్చినట్లు పార్టీ కాంట్రిబ్యూషన్ రిపోర్టు తెలిపింది. గుజరాత్‌లోని సంసద్‌లో సెమీకండక్టర్ యూనిట్‌ను ఏర్పాటు చేసేందుకు కేన్స్ సంస్థ అయిన సెమికాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు గతేడాది సెప్టెంబరులో అనుమతి లభించింది.

బిజెపికి అందిన విరాళాల సమయంపై అటు టాటా గ్రూపునకు ఇటు కేంద్రానికి స్క్రోల్ గ్రూపు ప్రశ్నలు సంధించినా ఇప్పటివరకు ఎవరి నుండి ఎలాంటి స్పందన లేదు. ప్రభుత్వం అందచేసిన సమాచారం ప్రకారం టాటా గ్రూపు ఈరెండు యూనిట్లపై రూ.1.18 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనుంది. తద్వారా 46వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు కల్పించనుంది.

# హాంకాంగ్ అగ్నిప్రమాదంలో పెరుగుతున్న మృతుల సంఖ్య..

**83కి చేరిన మృతుల సంఖ్య..280 మంది ఆచూకీ గల్లంతు..**

**కొనసాగుతున్న సహాయక చర్యలు**



**హాంకాంగ్:** హాంకాంగ్‌లోని ఓ భారీ భవన సముదాయంలో జరిగిన అగ్నిప్రమాదంలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఈ ఘోర దుర్ఘటనలో ఇప్పటివరకు 83 మంది మరణించినట్లు అధికారులు ధ్రువీకరించారు. మరో 76 మంది గాయపడగా, వారిలో 28 మంది పరిస్థితి విషమంగా ఉంది. సుమారు 280 మంది ఆచూకీ తెలియకపోవడంతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. భవన శిథిలాల్లో ఇంకా చాలా మంది చిక్కుకొని ఉంటారని భావిస్తున్నారు. థాయ్ పో జిల్లాలోని ఈ భవన సముదాయంలో మరమ్మతులు జరుగుతుండగా మంటలు చెలరేగాయి. చూస్తుండగానే ఏడు బ్లాకులకు మంటలు వేగంగా వ్యాపించాయి. ప్రస్తుతం నాలుగింటిలో మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, మిగిలిన మూడు భవనాల్లో ఇంకా అగ్నికీలలు ఎగసిపడుతూనే ఉన్నాయి. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వందలాది మందిని తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించారు. సహాయక చర్యల్లో 304 ఫైర్ ఇంజిన్లు, రెస్క్యూ వాహనాలు పాల్గొంటున్నాయి.

భవనానికి మరమ్మతుల కోసం ఏర్పాటు చేసిన వెదురు బొంగులు, గ్రీన్ మెష్ వల్ల ప్రమాద తీవ్రత పెరిగినట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. కిటికీలకు అమర్చిన పాలిస్టరైన్ బోర్డులు అత్యంత సులభంగా మండే స్వభావం కలిగి ఉండటమే పెను విషాదానికి కారణంగా అనుమానిస్తున్నారు. 1983లో నిర్మించిన ఈ కాంప్లెక్స్‌లో మొత్తం 4,600 మంది నివసిస్తుండగా, వీరిలో 40 శాతం మంది 60 ఏళ్లు పైబడినవారే. గత 70 ఏళ్లలో హాంకాంగ్‌లో ఇంతటి ఘోర అగ్నిప్రమాదం జరగలేదని అధికారులు తెలిపారు.




# మహిళల టీ20 సిరీస్.. పూర్తి షెడ్యూల్ ఇదే!




భారత మహిళల జట్టు ఇటీవల వన్డే ప్రపంచ కప్ గెలిచి విశ్వవిజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ టోర్నీ తర్వాత టీమిండియా తొలిసారిగా శ్రీలంకతో ఐదు టీ20ల సిరీస్‌లో తలపడనుంది. వాస్తవానికి టీమిండియా బంగ్లాదేశ్‌తో డిసెంబర్‌లో మూడు టీ20ల సిరీస్ ఆడాల్సి ఉంది. కానీ రెండు దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అది వాయిదా పడింది. దీంతో మహిళల టీమిండియా శ్రీలంక తో పోటీ పడనుంది. ఈ మేరకు బీసీసీఐ ఈ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను విడుదల చేసింది. ఈ సిరీస్‌లో తొలి మ్యాచ్ డిసెంబర్ 21న వైజాగ్‌లో, చివరి మ్యాచ్ డిసెంబర్ 30న తిరువనంతపురంలో జరగనుంది. ఇది టీ20 ప్రపంచ కప్ 2026కు మొదటి సన్నాహకంగా భావిస్తున్నారు. 2024లో జరిగిన టోర్నమెంట్‌లో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా చేతిలో ఓడిపోయిన తర్వాత టీమిండియా లీగ్ దశలోనే నిష్క్రమించింది. అనంతరం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు వెస్టిండీస్(2-1), ఇంగ్లండ్(3-2)తో జరిగిన సిరీస్‌లను కైవసం చేసుకుంది. టీ20 ప్రపంచ కప్ 2026కు ముందు టీమిండియా ఆస్ట్రేలియా (ఫిబ్రవరి 2026), ఇంగ్లాండ్‌తో (మే 2026) తలపడనుంది.

టీమిండియా-శ్రీలంక టీ20 సిరీస్ షెడ్యూల్

ఆదివారం - 21 డిసెంబర్ - మొదటి టీ20 - విశాఖపట్నం

మంగళవారం - 23 డిసెంబర్ - రెండో టీ20 - విశాఖపట్నం

శుక్రవారం - 26 డిసెంబర్ - మూడో టీ20 - తిరువనంతపురం

ఆదివారం - 28 డిసెంబర్ - నాలుగో టీ20 - తిరువనంతపురం

మంగళవారం - 30 డిసెంబర్ - అయిదో టీ20 - తిరువనంతపురం

# బంతి అంటే భయం.. భయం..




దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌ను టీమిండియా వైట్‌వాష్ గురైంది. ఈ ఓటమికి ప్రధాన కారణం టాప్ ఆర్డర్ బ్యాటర్ల వైఫల్యమేనని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. దక్షిణాఫ్రికా బౌలర్ల బంతులను ఎదుర్కొనేరదుకే భారత టాపార్డర్ భయపడిపోయే పరిస్థితి గత రెరడు మ్యాచుల్లో కనిపిరచడం ఆశ్చర్యం కలిగిస్తోరది. పట్టుమని పది ఓవర్లు కూడా ఆడడంలో విఫలమయ్యారంటే వారిపై వారికే నమ్మకం లేకుండా పోయిరదనే చెప్పాలి. తిరిగే బంతులు, ఎగిసే బంతులన్న తేడా లేకుండా అన్ని బంతులు భారత బాట్స్‌మన్ వైఫల్యాలకు అద్దంపట్టాయి.

విదేశీ పిచ్‌లపై చెలరేగి ఆడే ప్రధాన బ్యాటర్లు భారత పిచ్‌లపై డీలా పడడం సగటు ప్రతి ఒక్క అభిమానిని కలచివేస్తోంది. ఈ సిరీస్‌కు ముందే ఇంగ్లండ్ గడ్డపై టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పరుగుల వరద పారించాడు. కానీ దక్షిణాఫ్రికాతో స్వదేశీ పిచ్‌పై ఒక్క ఇన్నింగ్స్ మాత్రమే ఆడి ఘోరంగా విఫలమయ్యాడు. ఆ తర్వాత గాయపడి టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. కెప్టెన్ ఒక్కరే కాదు.. జైస్వాల్, కెఎల్ రాహుల్, సాయి సుదర్శన్, ధృవ్ జురెల్, రిషబ్ పంత్.. ఇలా టాపార్డర్ బ్యాటర్లంతా దక్షిణాఫ్రికా బౌలర్లు వేసిన బంతులను ఎదుర్కోలేకపోయారు. కానీ లోయర్ ఆర్డర్ బ్యాటర్లు వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, జడేజా దక్షిణాఫ్రికా బౌలర్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు.

దక్షిణాఫ్రికాతో జరిగిన రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో టీమిండియా ఆటగాళ్లు మొత్తం 1470బంతులు ఆడారు. ఇందులో భారత టాపార్డర్ బ్యాటర్లు జైస్వాల్, రాహుల్, జురెల్, పంత్ నాలుగు ఇన్నింగ్స్‌లో కలిపి 496బంతులు ఆడగా.. లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ముగ్గురు సుందర్‌బీ కుల్దీప్, జడేజా కలిసి 677 బంతులు ఆడి దక్షిణాఫ్రికా ఆటగాళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొన్నారు.

రెండు టెస్టుల్లో కలిపి జైస్వాల్(158బంతులు), రాహుల్(217), జురెల్(62), పంత్(59) బంతులు ఆడగా.. సుందర్(310బంతులు), కుల్దీప్(193), జడేజా(174) కలిసి నాలుగు ఇన్నింగ్స్‌లో ఆడారు. వాస్తవానికి స్పిన్ అరటే చాలు భారత ఆటగాళ్లు రెచ్చిపోతారు. అయితే ఇటీవల కాలంలో మాత్రం తిరుగుతున్న బంతికి బ్యాటర్లు కూడా గిరగిరా తిరిగిపోతున్నారు. బంతిని అర్థం చేసుకోలేక టాపార్డర్ కకా వికలమైపోతోరది. విచిత్రమేమిటంటే%ౌ% లోయర్ ఆర్డర్ ఆటగాళ్లు మాత్రం స్పిన్‌ను చక్కగా ఎదుర్కొరటూ టాపార్డర్‌కు పాఠాలు నేర్పుతున్నారు. ఒక ఇన్నిరగ్స్‌లో కేవలం బౌలర్ మాత్రమే అయిన కులదీప్ యాదవ్ ఏకంగా 134 బంతులను ఎదుర్కొనడంపై సీనియర్లే హాట్సాఫ్ అరటున్నారు.




# రికార్డ్ ధరకు అఖండ 2 రైట్స్



నటసింహం నందమూరి బాల కృష్ణ, దర్శకుడు బోయ పాటి శ్రీను కాంబోలో వస్తున్న చిత్రం 'అఖండ 2 తాండవం'. డిసెంబర్ 5న ఈ మూవీ గ్రాండ్‌గా థియేటర్‌లో విడుదల కానుంది. ఈ సినిమాను పాన్ఇండియా వైడ్‌గా రిలీజ్ చేయనున్నారు. ఈ మూవీ రిలీజ్ కోసం ఇంకా వారం రోజుల సమయం మాత్రమే ఉంది. దీంతో చిత్ర బృందం ప్రమోషన్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించింది. తాజాగా ఈ సినిమాపై ఆసక్తికరమైన అప్డేట్? బయటికి వచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్, ఓటీటీ, మ్యూజికల్ రైట్స్‌కు సంబంధించిన ఒప్పందాలు కుదిరినట్లు తెలుస్తోంది.

ఈ చిత్రానికి సంబంధించిన థియేట్రికల్, నాన్-థియేట్రికల్ డీల్? విలువ రూ.250 కోట్లు అని సమాచారం. ఇదే నిజమైతే బాలయ్య కెరీర్?లోనే హైయ్యెస్ట్ డీల్‌గా నిలవనుంది. తద్వారా నిర్మాతలకు కాసుల పంట పండనుంది. ఇప్పటికే రిలీజ్ అయిన ట్రైలర్, పాటలకు ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ వచ్చింది.

బాలకృష్ణ, బోయపాటి శ్రీను కాంబినేషన్ తెలుగు సినీ పరిశ్రమలోని హిట్? జోడీల్లో ఒకటి. వీరిద్దరి కాంబినేషన్‌లో ఇది 4వ సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. అప్పటికే 'సింహ', 'లెజెండ్', 'అఖండ' వంటి బ్లాక్‌బస్టర్‌తో అభిమానులను మెప్పించారు. బోయపాటి స్క్రీన్‌ప్లే, బాలయ్య డైలాగులు, హై వోల్టేజ్ యాక్షన్, ఎమోషనల్ సీన్స్, బీజీయమ్ కలిస్తే ఫ్యాన్స్‌కు పండగే. ఈ ఏడాది ప్రారంభంలో 'డాకు మహారాజ్' సినిమాతో వచ్చిన బాలయ్య కొన్ని నెలల గ్యాప్ తర్వాత మళ్లీ ఇప్పుడు పాన్‌ఇండియా లెవెల్లో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. 'అఖండ 2' సినిమాను 3డీలోనూ రిలీజ్ చేయనున్నట్టు మూవీ టీమ్ తెలిపింది. ఇటీవలస్పెషల్ పోస్టర్?ను కూడా రిలీల్ చేశారు. "బాలకృష్ణ అభిమానులు, ఆడియన్స్?కు కొత్త అనుభూతి ఇవ్వాలన్న ఉద్దేశంతో 'అఖండ 2' సినిమాను 3డీ ఫార్మాట్‌లోనూ తీసుకొస్తున్నాం. ఈ సినిమా భారతదేశ ఆత్మ, పరమాత్మ. ఈ సినిమా మన దేశ ధర్మం, ధైర్యం. ప్రపంచ దేశాల్లో మతం కనిపిస్తుంది. కానీ, ఈ దేశంలో మాత్రమే సనాతన ధర్మం కనిపిస్తుంది. దాని ఆధారంగా రూపొందిస్తున్న సినిమా ఇది. ఈ సినిమాని దేశమంతా చూడాలనుకుంటున్నా" అని బోయపాటి శ్రీను ఇంతకు ముందు తెలిపారు.

# 'ఇఫీ' ఫిల్మ్ ఫెస్టివల్ లో సందడి చేసిన 'కమిటీ కుర్రోళ్లు'



చిన్న సినిమాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్ విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' చిత్రం ఇప్పుడు అంతర్జాతీయ వేదికపై మెరిసింది. గోవాలో జరుగుతున్న 56వ అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఇఫీ) 2025లో ఈ సినిమాను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు విశేష స్పందన లభించింది.

ఈ ఏడాది ఆగస్టు 9న థియేటర్లలోకి వచ్చిన ఈ చిత్రం, తక్కువ బడ్జెట్‌తో రూపొంది అనూహ్య విజయాన్ని అందుకుంది. కొత్త నటీనటులు సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు ప్రధాన పాత్రలలో నటించారు. నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మించగా, యదు వంశీ దర్శకత్వం వహించారు. అనుదీప్ దేవ్ అందించిన సంగీతం సినిమా విజయంలో కీలక పాత్ర పోషించింది.

తెలుగు ప్రేక్షకులను మెప్పించిన ఈ చిత్రం ఇప్పుడు 'ఇఫీ' వంటి ప్రతిష్ఠాత్మక వేదికపై ప్రదర్శితం కావడం పట్ల చిత్ర యూనిట్ ఆనందం వ్యక్తం చేసింది.




# సోషల్ మీడియా వేధింపులపై నటి గిరిజా ఓక్ ఆవేదన



ప్రముఖుల వ్యక్తిగత జీవితాలపై సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ ఇటీవల అధికమయ్యాయి. దీని కారణంగా వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మరాఠీ నటి గిరిజా ఓక్ తనకు ఎదురవుతున్న చేదు అను భవాలను పంచుకుంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

మరాఠీ చిత్ర పరిశ్రమలో మంచి గుర్తింపు పొందిన గిరిజా ఓక్, ఇటీవల ఒక చిన్న వీడియో క్లిప్‌తో సోషల్ మీడియాలో సంచలనం సృష్టించారు. దీంతో ఆమెను అనుసరించే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగింది. అయితే, ఈ పాప్యులారిటీ సినిమా అవకాశాలు తీసుకురాకపోగా, తీవ్రమైన వేధింపులను తెచ్చిపెట్టిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ మధ్య ఒక ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. సోషల్ మీడియాలో వచ్చిన పాప్యులారిటీ వల్ల జీవితంలో పెద్దగా మార్పు రాలేదని, కానీ అసభ్యకరమైన కామెంట్లు, మెసేజ్‌లు మాత్రం విపరీతంగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. "నీ రేటు ఎంత?", "ఒక గంటకు ఎంత తీసుకుంటావు?" లాంటి నీచమైన సందేశాలు రోజూ వస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, ఆన్‌లైన్‌లో ఇలా ప్రవర్తించే వాళ్లే బయట కనిపిస్తే కనీసం కన్నెత్తి కూడా చూడరని, ఎంతో గౌరవంగా మాట్లాడతారని చెప్పారు. కానీ ఆన్‌లైన్‌లో మాత్రం నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని గిరిజ ఆవేదన చెందారు. ప్రస్తుతం ఆమె చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. సెలబ్రిటీలు ఎదుర్కొంటున్న ఆన్‌లైన్ వేధింపులపై మరోసారి చర్చకు దారితీశాయి.

Edited, Printed, Published & Owned by LEKKALA SREENU and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at Guddapuvalasa Ramani, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082